
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
సోమవారం, 16 జూన్ 2025



అనుమతుల్లేకున్నా...
అడ్మిషన్లు

- పుట్టగొడుగుల్లా ప్లే స్కూల్స్
- కనీస ప్రమాణాలు పాటించని యాజమాన్యాలు
- పలు పాఠశాలలు పాత భవనాల్లోనే..
- కొన్ని చోట్ల కేవలం ఒకే గదిలో నిర్వహణ
- చిన్నారుల భద్రతపై అనుమానాలు
- కలెక్టర్ ఆధ్వర్యంలో తనిఖీలకు పేరెంట్స్ మనవి

6



భట్టికి మంత్రి తుమ్మల జన్మదిన శుభాకాంక్షలు

ఖమ్మం, జూన్ 15(ఆంధ్రజ్యోతిప్రతినిధి): డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క జన్మదినం సందర్భంగా ఆదివారం హైదరాబాదులోని జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌కు వెళ్లి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల శాలువాతో భట్టిని సత్కరించారు.

గిరిజన జిల్లా అభివృద్ధి సాధకుడు



- భద్రాద్రి జిల్లా కలెక్టర్‌గా జితేష్ బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది పూర్తి
- పాలనలో తనదైన శైలిలో పథకాల అమలు

7

ఒకవైపు మద్యం ధరలు అంతకంతకూ పెరుగుతుండడం, మరోవైపు ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఉమ్మడి జిల్లాలో మళ్లీ నాటు సారా గుప్పుమంటోంది. పల్లెల నుంచి పట్టణాల వరకు గుడుంబా విక్రయాలు పెరుగుతున్నాయి. గతంలో వరంగల్, ఏపీ సరిహద్దు మండలాల్లోనే గుడుంబా విక్రయాలు సాగగా.. తాజాగా ఖమ్మం నగరంలోనూ గుడుంబా వాసన గుప్పుమంటోంది. మరోవైపు గుడుంబాను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం కూడా సారా వ్యాపారులకు కలిసి వస్తోంది. ఈ సంవత్సరం సారా విక్రయాలు పెరిగినా.. గత సంవత్సరం కంటే కేసులు తక్కువగా నమోదు కావటం ఎక్సైజ్‌శాఖ అధికారుల పనితీరును ప్రశ్నిస్తోంది.

కోరలు చాస్తున్న సా'రాకాసి'



- ఉమ్మడి జిల్లాలో గుప్పుమంటున్న గుడుంబా
- జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో యథేచ్ఛగా తయారీ
- బెల్లం సరఫరా కేంద్రంగా ఖమ్మం త్రీటౌన్
- ఎక్సైజ్ అధికారులంతా ఇతర ప్రాంతాల నుంచే రాకపోకలు
- గుడుంబా అదుపులోనే ఉంది : ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం త్రీటౌన్ ప్రాంతం ఈ మధ్య కాలంలో బెల్లం అమ్మకాల మార్కెట్‌గా మారిపోయింది. గుడుంబా తయారీకి గతంలో తక్కువ ధరలకు అందుబాటులో ఉండే నల్లబెల్లాన్ని వాడేవారు. అయితే ఇప్పుడు సాధారణ బెల్లంలోనే నాసిరకం బెల్లం అమ్మకాలు పెరిగాయి. మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాలకు ఖమ్మం నుంచి బెల్లం యథేచ్ఛగా ఆటోల్లో క్వింటాళ్ల కొద్దీ తరలిస్తున్నారు. ఇదే ప్రాంతంలో యూరియా, ఎరువులు, పండ్ల వ్యర్థాలను సైతం కొనుగోలు చేసి గుడుంబా స్థావరాలకు సరఫరా చేస్తున్నారు. ఈ మొత్తం దందాలో ప్రత్యేకంగా ఒక గుడుంబా రాకెట్ తయారైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అమ్మకాలు పెరుగుతున్నా.. తగ్గుతున్న కేసులు

జిల్లాలో ఒకపక్క రోజురోజుకు గుడుంబా అమ్మకాలు విచ్చలవిడిగా పెరుగుతున్నా ఎక్సైజ్‌శాఖ నుంచి ఆ మేరకు కేసులు పెరగకపోగా తగ్గుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2024 కంటే 2025లో ఇప్పటి వరకు నమోదైన కేసులను బట్టి గుడుంబా నివారణపై ఎక్సైజ్‌శాఖ అధికారుల పర్యవేక్షణ ఇట్టే తెలిసిపోతుంది. 2024లో ఖమ్మం జిల్లాలో 480, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,039 మొత్తం 1,519కేసులు నమోదయ్యాయి. 2025లో

(మిగతా 6వ పేజీలో)

ప్రత్యేక డ్రైవ్ చేపడతాం..

జనార్థన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గుడుంబా అమ్మకాలపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నాం. ఏపీ సరిహద్దుల్లో ఆయా ప్రాంతాల పోలీసులను భాగస్వామ్యం చేసుకొని దాడులు చేస్తున్నాం. ఖమ్మం నుంచి బెల్లం అమ్మకాలు జరిగే విషయం మా దృష్టికి రాలేదు. గుడుంబాను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ తీసుకుంటాం.

వారం రోజుల్లో
రైతు భరోసా

- పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తున్నాం
- రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచిలో అరకపట్టి ఏరువాక ప్రారంభం



కూసుమంచిలో ఏరువాక కార్యక్రమంలో అరక దున్నుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగుకు ముందే సోమవారం నుంచి రైతులకు పెట్టుబడిసాయంగా రైతు భరోసా అందించనున్నట్టు రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ఆదివారం పర్యటించిన మంత్రి పొంగులేటి కూసుమంచి మండల కేంద్రంలో ఏరువాక ప్రారంభించారు. ఈ సందర్భంగా కందుల వెంకన్న అనే రైతు చేనులో అరక దున్నారు. కూలీలతో కలిసి పత్తి విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా రైతులకు, వ్యవసాయ కూలీలకు మంత్రి ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ రైతులు పంటలు పండించేందుకు అవసరమైన పెట్టుబడికోసం షావుకార్ల వద్దకు వెళ్లకుండా, బ్యాంకుల చుట్టూ తిరగకుండా సాగుకు ముందే సాయం అందిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఒక కుంట నుంచి ఎన్ని ఎకరాలు సాగుచేస్తే అన్ని ఎకరాలకు, ఎకరానికి రూ.12వేలు ఖాతాల్లో వారం రోజుల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 15రోజుల ముందే రుతుపవనాల రాకతో సాగు ప్రారంభం కావడం అదృష్టమన్నారు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్న తర్వాత అన్ని సంక్షేమ కార్యక్రమాలతో పాటు రైతును రాజు చేయాలనే (మిగతా 6వ పేజీలో)

ఆయనంతే..
సప'రేటు'!



- ఖమ్మం నగర పాలకంలో ప్రక్షాళనకు అడ్డంకి
- తొలగించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మళ్లీ పోస్టింగులు
- కార్యాలయంలో ల్యాప్‌టాప్‌లు మాయం?
- పలు అవినీతి వ్యవహారాల్లో సదరు ఉద్యోగిపై ఆరోపణలు
- నేరుగా సీఎంకు ఫిర్యాదు చేసిన నిరుద్యోగులు
- కలెక్టరేట్ నుంచి కార్పొరేషన్‌కు చేరిన ఫిర్యాదు లేఖ

ఖమ్మం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య బాధ్యతలు చేపట్టిన తర్వాత నగర పాలక కార్యాలయంలో జరుగుతున్న అవకతవకలను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపడుతూ వస్తున్నారు. కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిని, వర్గాలుగా విడిపోయి ఉద్యోగుల మధ్య చిచ్చుపెట్టే వారిని సైతం గుర్తించి వారికి తగ్గట్టుగా కీలక నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నారు. అందులో భాగంగానే రెవెన్యూ విభాగంలో ఎప్పటినుంచో వస్తున్న ఆరోపణలకు సంబంధించిన విచారణ చేయించి కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఏకంగా ఉద్యోగం నుంచే తొలగించారు. మరో ఇద్దరు ఆర్‌ఐలపై సైతం చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది. అయితే ఆయా అక్రమాల ప్రక్షాళనకు పేషీలోని ఓ ఉద్యోగి అడ్డంకిగా మారాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానికి సంబంధించి కొందరు నిరుద్యోగులు ఏకంగా సీఎంకు ఫిర్యాదు చేయగా ఆ లేఖను కలెక్టరేట్‌కు పంపారు. ఆ లేఖ అక్కడి నుంచి ప్రస్తుతం కార్పొరేషన్‌కు చేరగా.. సదరు ఉద్యోగిపై వస్తున్న ఆరోపణలకు ఆ ఫిర్యాదు మరింత బలం చేకూరుస్తున్నట్టుగా తెలుస్తోంది.

తొలగించిన వారు మళ్లీ విధుల్లోకి..

కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలకు సంబంధించి ఇటీవల కాలంలో ఇద్దరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రమేయం స్పష్టంగా తేలడంతో వారిని విధుల నుంచి తొలగించారు. అంతే కాకుండా మరికొందరు అధికారులపై కూడా చర్యలకు పూనుకున్నారు. అయితే పేషీలోని ఓ ఉద్యోగి మాత్రం అక్రమాలకు పాల్పడిన వారికి వంత పాడుతూ కార్పొరేషన్ కార్యాలయాన్నే తన గుప్పిట్లో పెట్టుకొని ఎన్ని తప్పులు చేసినా ఓ వర్గాన్ని కాపాడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఎవరిని అయినా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఉద్యోగం నుంచి తొలగిస్తే.. వారిని మళ్లీ విధుల్లోకి తీసుకొచ్చి పెట్టడం ఆయనకు అలవాటేనని చెబుతున్నారు. గతంలో ఎలాంటి అర్హత లేకుండానే సుడా నుంచి కార్పొరేషన్‌కు వచ్చి విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించగా ఆ ఉద్యోగిని తిరిగి ఉద్యోగంలో

(మిగతా 6వ పేజీలో)

శాశ్వత పరిష్కారమేదీ?

- భద్రాద్రి ఏజెన్సీలో గోదావరి వరద బెంగ
- ఏటా తప్పని ముంపు భయం
- గోదావరి వరదలపై రేపు కలెక్టర్ ముందస్తు సమీక్ష

భద్రాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ఏజెన్సీ వాసులకు ప్రతి ఏడాది ముంపు బెడద తప్పడం లేదు. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రమైన భద్రాచలంలో పరిస్థితి మరీ వర్ణనాతీతంగా ఉంటుంది. భద్రాచలం పట్టణానికి గోదావరి కరకట్ట రక్షణగా నిలుస్తున్నా.. బ్యాక్‌వాటర్, వర్షపు నీరు, మురుగునీరు రాకతో విస్తా కాంప్లెక్సు పరిసరాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ సమస్య గత 25 ఏళ్లుగా కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారాన్ని ప్రభుత్వాలు చూపలేకపోతున్నాయనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గోదావరి చివరి ప్రమాద హెచ్చరిక 53 అడుగులు దాటి ప్రవహిస్తే ఏజెన్సీలోని నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ఏజెన్సీవాసుల్లో అలజడి నెలకొంటుంది. గత కొన్నేళ్లుగా జూలై నెలలోనే గోదావరి తన ఉగ్రరూపాన్ని చూపుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. 2022 జూలై 16న భద్రాచలం వద్ద గోదావరి 71.3 అడుగులు గరిష్ఠ నీటిమట్టం నమోదు కాగా గత 32 ఏళ్లల్లో ఇదే అత్యధిక నీటిమట్టం. ఈ క్రమంలో నదీ పరివాహక ప్రాంతంలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు మండలాలు అతలాకుతలమయ్యాయి. 2023 జూలై 30న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 56.1 అడుగు నమోదైంది. 2024 జూలై 27న భద్రాచలం వద్ద గోదావరి 53.6 అడుగులకు చేరడంతో 34 గ్రామాలు జలవలయంలో చిక్కుకున్నాయి. బ్యాక్ వాటర్ సమస్యతో భద్రాచలంలోని కాలనీలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో ఈసారి మళ్లీ గోదావరి వరదల సీజన్ సమీపిస్తుండటంతో ఏజెన్సీ వాసుల్లో భయం మొదలైంది. ఈ క్రమంలో కొత్తగూడెం కలెక్టరేట్‌లో గోదావరి వరదల సహాయక ముందస్తు చర్యలపై మంగళవారం భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమీక్ష నిర్వహించనున్నారు.



రామాలయం పరిసరాల్లో వరద నీరు (ఫైల్)

ప్రతి ఏటా వరద ముంపు తప్పదు

ఒకసారి కాదు.. రెండుసార్లు కాదు.. ఇలా ప్రతి ఏటా జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాలు వచ్చాయంటే భద్రాద్రి ఏజెన్సీవాసులకు గోదావరి ముంపు బెడద తప్పడం లేదు. గోదావరి 60 అడుగులు దాటి ప్రవహిస్తే ప్రధాన రహదారులపై (మిగతా 6వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

రాష్ట్రంలో అరకొరగా 'సంక్షేమం' అమలు

- కమీషన్ల మయంగా కాంగ్రెస్ సర్కార్
- నేడు ఇల్లెందులో 'రాయల' సంస్మరణ సభ
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కమీషన్లు మయంగా మారిందని, ఏ సంక్షేమ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. అరకొరగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనపై పూర్తిస్థాయిలో పట్టు సాధించలేక పోయారన్నారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు మూడు రోజులు పాటుగా ఖమ్మం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రీయ అంశాలు, పార్టీ, ప్రజా సంఘాలు బలోపేతం, కగార్ ఆపరేషన్, సిందూర్ ఆపరేషన్‌తో పాటు పార్టీ అంతర్గత అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటు రంగారావు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర సమావేశాల నిర్ణయాలను ప్రకటించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న మిలటరీ దాడుల వెనుక అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాత్ర ఉందన్నారు. ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ 19న రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన సెంటర్లు, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తామని వివరించారు. దివంగత నాయకులు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని ఇల్లెందులో సోమవారం 16వేల మంది కార్యకర్తల ర్యాలీ నిర్వహించి స్థూపం, పుస్తకావిష్కరణ, వర్ధంతి సభను నిర్వహిస్తామన్నారు. కార్పొరేట్ శక్తులను విమానయానరంగంలో ప్రోత్సహించటం, కనీస నిర్వహణ, భద్రతా ప్రమాణాలు పరిశీలించకుండా ఎయిర్ ఇండియా విమానాలు నడపటంతో అహ్మదాబాద్‌లో విమానప్రమాదం జరిగిందన్నారు. ఇందుకు బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి లేదా కేంద్ర విమానయానశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేజీ రామచందర్, కే రమా, కెచ్చెల రంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో)



పూడిక పేరుకుపోయిన దబ్బతోగు ప్రాజెక్ట్

దుర్భర స్థితిలో 'దబ్బతోగు'

- వందల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టుపై నిర్లక్ష్యం
- శిథిలమైన షట్టర్లు.. ధ్వంసమైన అలుగులు
- 25 ఏళ్లనాటి ప్రాజెక్టుకు కనీస మరమ్మతులు కరవు

అశ్వారావుపేట రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఐదు గిరిజన గ్రామాల పరిధిలో వందలాది ఎకరాలకు సాగు నీరందించే ప్రాజెక్టు అది.. గిరిజన ప్రాంతంలో అన్నదాతలకు సాగునీరందించటమే లక్ష్యంగా పాతికేళ్ల క్రితం ఆనాటి పాలకులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్టు నిర్మాణం చేయగా నాడు రైతుల్లో కళ్లల్లో ఎనలేని ఆనందం కనిపించింది. ఏళ్లపాటు వందల ఎకరాలకు సాగు నీరందించిన ప్రాజెక్టు పరిస్థితి నేడు దుర్భరంగా మారింది. ప్రాజెక్టుకు కనీస మరమ్మతులు చేయకపోవటంతో రైతులకు సాగునీరందే పరిస్థితి కనిపించటం లేదు. పాలకులు మారినా ప్రాజెక్టు పరిస్థితిలో మార్పు (మిగతా 6వ పేజీలో)

గిరిజనుల హక్కుల సాధనకు
ఢిల్లీ స్థాయిలో ఆందోళనకు సిద్ధం

- ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు దాస్‌రాం నాయక్

6



భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న వైదికుడు

మూలవరులకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన

భద్రాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం సందర్భంగా స్వామి వారికి అంతరాలయంలో మూలవరులకు ఆర్జిత సేవలో భాగంగా ప్రత్యేక అభిషేకం. స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఈ సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చిత్రకూట మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. ఆదివారం కావడంతో వివిధప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ఇలవేల్పయిన స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రజల పక్షాన నిలబడేది కమ్యూనిస్టులే

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం



మాట్లాడుతున్న హేమంతరావు

రఘునాథపాలెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పదవులు ఉన్నా లేకున్నా ప్రజల ప్రక్షాన నిలబడేది కమ్యూనిస్టులే అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ఆదివారం వి. వెంకటాయపాలెంలో సీపీఐ మండల మహాసభలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాన్ని నిరుగార్చేందుకు ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తున్నారని ఆరోపించారు. రైతు భరోసా, రైతు బీమా నిధులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జమ్ముల జితేందర్‌రెడ్డి, శాఖమూరి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్లే స్కూల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. విద్యాశాఖ నుంచి అనుమతులు తీసుకోకుండానే బజారు కొకటిచొప్పున వెలుస్తున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎలాంటి అనుమతి లేకుండా 40 వరకు ప్లేస్కూల్స్ నడుస్తున్నాయి. ఏ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో నిర్వాహకుల ఆగడాలకు అంతులేకుండా పోయింది.



- విద్యాశాఖ పర్యవేక్షణ నిల్
- కనీస ప్రమాణాలు పాటించని యాజమాన్యాలు
- పలు చోట్ల పాత భవనాల్లో..
- కొన్ని చోట్ల కేవలం ఒకే గదిలో నిర్వహణ
- చిన్నారుల భద్రతపై అనుమానాలు
- కలెక్టర్ ఆధ్వర్యంలో తనిఖీలకు పేరెంట్స్ వినతి

అనుమతుల్లేకున్నా... అడ్మిషన్లు..

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్లేస్కూల్స్

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్లే స్కూల్స్‌లో యాజమాన్యాలు అడిగినంత ఫీజు చెల్లించాల్సిందే. అందులో చిన్నారుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై ఎటువంటి భరోసా కల్పిస్తున్నారో వారు చెప్పరు. ఒక్కో పాఠశాలల్లో 50 నుంచి 60 మంది చిన్నారులను చేర్చుకుంటున్నారు. వారి ఆలనా, పాలనను చూసేందుకు ఇద్దరో, ముగ్గురో ఆయమ్మలను నియమించి, కనీస విద్యా అర్హతలు లేని వారితో తరగతులు నిర్వహిస్తున్నారు. పసి బిడ్డలకు అందించే సౌకర్యాలు, విద్యపై ట్రాక్ చేయడానికి, నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ నిబంధనల ప్రకారం ఈ ప్లే స్కూల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. కాని ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క ప్లేస్కూల్స్‌లో ఈ నిబంధనలు ప్రకారం నడవటం లేదు.



మూడేళ్ల లోపుంటే ప్రవేశం లేదు...

1 ఏప్రిల్, 2010 నుంచి అమల్లోకి వచ్చిన ఉచిత నిర్బంధ విద్య.. పిల్లల హక్కు చట్టం కూడా బాల్య సంరక్షణకు సంబంధించినది. ప్లే-స్కూల్స్ ప్రారంభ విద్యకు చాలా అనువైనవే కాని, వాటి ప్రమాణాలపై పేరెంట్స్‌కు ఉన్న అనుమానాలు తీర్చే అధికారులు కనిపించడం లేదు. ఒక పిల్లవాడు మూడు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నట్లయితే, వారు ప్లేస్కూల్‌లకు వెళ్లటం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ నిబంధనలకు విరుద్ధం. మూడేళ్ల లోపు వారికి చదువు చెప్పడం ప్రభుత్వ నియమాలను ఉల్లంఘించడమే.మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను చేర్చుకునే ప్లే స్కూల్‌లను నియంత్రించడానికి కమిషన్ మార్గదర్శకాలను రూపొందిస్తోంది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే నగరంలో కొత్త ప్లేస్కూళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ ప్లే స్కూల్స్‌కు జిల్లాలో ఏ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవటం, ఏ శాఖ అధికారుల అనుమతులు లేకపోవటంతో నగరంలో దాదాపు 20కి పైగా ప్లే స్కూల్స్ నడుస్తున్నాయి. కొన్ని పాఠశాలలు తల్లిదండ్రులను ఆకర్షించేందుకు భవనాలకు రంగు రంగుల బొమ్మలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, అధిక రుసుము వసూలు చేస్తుంటే, కొన్ని పాఠశాలలు రద్దీగా ఉండే మార్గాల్లో పాత భవనాల్లో నడుస్తున్నాయి. ప్లేస్కూల్స్‌లో అడ్మిషన్ ఫీజుతో సహా అధిక మొత్తంలో రుసుము చేస్తున్నారే వాదనలు వినపడుతున్నాయి.

తనిఖీలు చేయరా...

ఖమ్మం నగరంలోని బైపాస్, గట్టయ్య సెంటర్, గాంధీచౌక్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, రోటరీనగర్, మామిళ్లగుడెం, రాపర్తినగర్, జయనగర్ కాలని, తదితర ప్రాంతాల్లో ఈ ప్లే స్కూల్స్ నడుస్తున్నాయి. ఎక్కువ ప్లే స్కూల్స్ పాఠశాలలు పాత భవనాలు, అపార్ట్‌మెంట్‌లలో నాల్గో ఫ్లోర్, ఐదో ఫ్లోర్‌లలో చిన్నారులకు నడుస్తున్నాయి. ప్లే స్కూల్స్‌లను కేవలం మెదటి ఫ్లోర్, గ్రౌండ్ ఫ్లోర్‌లలో ఏర్పాటు చేయాల్సి ఉండగా కొన్ని ప్లేస్కూల్స్ అపార్ట్‌మెంట్‌లలో మూడు, నాలుగు ఫ్లోర్‌లలో ఏర్పాటు చేసి చిన్నారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీటిని కలెక్టర్ ఆధ్వర్యంలో తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒక గదిలోనే బడి...

అంతర్జాతీయ ప్రమాణాలతో నడుస్తున్న పాఠశాలలకు ప్రచారం కల్పిస్తూ కొన్ని పాఠశాలలు అడ్మిషన్ ఫీజు రూ.10వేలు వసూలు చేస్తున్నాయి. నెలవారీ రుసుము సుమారు రూ.6 వరకు వసూలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం అడ్మిషన్ ఫీజు వసూలు చేసే పాఠశాలలు ఉన్నాయి. ఇంకా, పాఠశాలలో సీసీ కెమెరాలు ఉన్నాయా లేదా పాఠశాలలు భద్రతలో లేకపోయినా భద్రత గురించి ఆలోచించకుండానే తల్లితండ్రులు పిల్లలను ప్లే స్కూల్స్‌లో చేర్పిస్తున్నారు. ప్లే స్కూల్స్‌లో భవనాలకు ఎన్‌ఓసీ అనుమతుల గురించి తల్లిదండ్రులు ఆరా తీయం లేదు. ఇళ్ల వద్ద ఉన్న సింగిల్ రూమ్‌లలో కొన్ని పాఠశాలలు కూడా ఉన్నాయి. ఈ ప్లేస్కూల్స్ బయట బోర్డు ప్రదర్శించరు. కేవలం ఒక గదిలోనే పాఠశాలను నిర్వహిస్తుంటారు.



సమావేశంలో సంఘీభావం ప్రదర్శిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

గిరిజనుల హక్కుల సాధనకు ఢిల్లీ స్థాయిలో ఆందోళనకు సిద్ధం

» ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు దాస్‌రాం నాయక్

ఖమ్మం చర్చికాంపౌండ్, జూన్15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల సాధన కోసం ఢిల్లీ స్థాయిలో ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు దాస్‌రాంనాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభాను బహిర్గతం చేయాలన్నారు. గిరిజనులు సాగుచేస్తున్న పోడు, లావణి భూముల సమస్యలు శాశ్వతంగా పరిష్కరించి వెంటనే పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీ సామాజిక వర్గానికి స్థానం కల్పించాలని, గోర్‌బాలీ భాషను అధికారికంగా గుర్తించి, కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతిని ఐచ్ఛిక సెలవు దినంగా కాకుండా సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఈ డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని లేకుంటే త్వరలోనే రాష్ట్ర స్థాయిలో, ఢిల్లీస్థాయిలో లక్షలాది మంది గిరిజన ప్రజానికంతో భారీ ఎత్తున ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈసమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, జాతీయ జనరల్ సెక్రటరీ డాక్టర్ నరేందర్ పవార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్, వాసునాయక్, గోవింద్‌నాయక్, కృష్ణనాయక్, బాలునాయక్, పంతులు నాయక్, అజ్మీర సమ్మయ్య, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు జంపానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులపై భారం మోపుతున్న యాజమాన్యం

» ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్‌షావళి



మాట్లాడుతున్న యాకూబ్‌షావళి

కొత్తగూడెం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం పని భారాన్ని పెంచుతుందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌యాకూబ్ షావళి ఆరోపించారు. కాంట్రాక్టర్లు కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీయూసీఐ రాష్ట్ర మహాసభలను ఈ నెల 21, 22 తేదీ నిజామాబాద్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి అసంఘటిత రంగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులంతా హాజరుకావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ కార్మిక చట్టాలను కాలరాస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు శరత్, సతీష్, చంద్రశేఖర్, జానయ్య, సంజీవరెడ్డి, శంకర్, సంధ్య పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారమేదీ?

(5వ పేజీ తరువాయి)

రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా జన జీవనం స్తంభిస్తుంది. ఈ క్రమంలో అధికార యంత్రాంగం ముందస్తుగా ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ముందస్తుగా బియ్యం, పెట్రోలు, డీజిల్, నూనె, కందిపప్పుతో పాటు ఇతర నిత్యవసర సామగ్రిలను బఫర్‌స్టాక్‌గా నిల్వ ఉంచాల్సి ఉంటుంది.

రివిట్‌మెంటు మరమ్మతులు మరిచారు

భద్రాచలంలోని కరకట్టకు విస్తాకాంప్లెక్స్, ఇతర స్లూయిస్‌ల వద్ద ఉన్న రివిట్‌మెంట్ మరమ్మతులను అధికారులు మరిచారు. ఎందుకంటే 2022 జూలై 16న వచ్చిన గోదావరి మహా ఉగ్ర రూపంతో 71.3అడుగులు దాటి ప్రవహించడంతో ఆ సమయంలో కరకట్ట ప్రాంతంలో కొన్నిచోట్ల రివిట్‌మెంట్ దెబ్బతినడంతో ఆ సమయంలో అధికారులు ఇసుక బస్తాలను వేసి తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. కానీ అనంతరం మూడేళ్లుగా ఈ విషయంపై దృష్టిసారించకపోవడంతో సమస్యకు పరిష్కారం లభించలేదు.

ముందస్తు అప్రమత్తత అవసరం

వరదల సీజన్‌లో వరద తీవ్రతను ముందస్తుగా గుర్తించి అధికార యంత్రాంగం ముంపు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయడం ఎంతో కీలకం. నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న వారిని మొదటిప్రమాద హెచ్చరిక సమయంలోనే హెచ్చరించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. అలాగే ముంపునకు గురవుతాయని భావిస్తున్న కాలనీల్లో ఇళ్లను ఎప్పటికప్పుడు పరిస్థితిని బట్టి ఖాళీ చేయిస్తూ ఉండాలి. అలాగే పునరావాస కేంద్రాల గుర్తింపు, అక్కడ వరద బాధితులకు కల్పించాల్సిన ఏర్పాట్లను ముందస్తుగా సిద్ధం చేయాలి. వరద తీవ్రత అధికంగా ఉన్న సమయంలో భద్రాచలంలోని విస్తా కాంప్లెక్స వద్ద నీటిని ఎత్తిపోసేందుకు ముందస్తుగానే కనీసం 1500 హెచ్‌పీ వరకు సామర్థ్యం ఉన్న మోటార్లను సిద్ధం చేసుకుంటే మంచిదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

శాశ్వత పరిష్కారం కరువు..

గోదావరి వరదల ముంపు బెడద తప్పేందుకు శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. గోదావరికి ఇరువైపులా కరకట్టల నిర్మాణం చేపట్టే ప్రతిపాదన గతంలోనే ఉంది. అయితే ఇంతటి ప్రాధాన్యత కలిగిన అంశంపై ప్రభుత్వాలు తొలి ఉంచి ఉదాసీన వైఖరే అవలంబిస్తున్నాయి. అదేవిధంగా భద్రాచలం వైపు ఉన్న కరకట్టను పటిష్టవంతం చేసి ఎత్తు పెంచాలనే డిమాండ్ భద్రాద్రివాసుల నుంచి ఉన్నా ఇంకా ఆచరణ రూపం దాల్చలేదు.

వారం రోజుల్లో రైతు భరోసా

(5వ పేజీ తరువాయి)

ఉద్దేశ్యంతో రాష్ట్ర ఆర్థికస్థితి బాగా లేకపోయినా, అవాంతరాలు ఎదురైనా.. రైతుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తోందన్నారు.

రూ.21వేల కోట్ల రుణమాఫీ

నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన పదేళ్లలో రూ.17వేల కోట్ల రుణమాఫీ చేస్తే.. నేటి ఇందిరమ్మ ప్రభుత్వం ఏడాది కాలంలో రూ.21కోట్లను 25లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి ఘనత చాటిందన్నారు. వీటితో పాటు సన్నధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. వరి వేస్తే ఉరి అన్న ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం ఏ రకమైన నిర్ణయాలు తీసుకుని రైతులను ఇబ్బందులు పెట్టిందో, దానికి భిన్నంగా తమ ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందన్నారు.

ఆనాటి ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్వార్థం కోసం ప్రాజెక్టులను ప్రారంభించి గాలికి వదిలేస్తే, వాటిని తాము పూర్తిచేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి.. ఇలా నిలిచిపోయిన ప్రాజెక్టులన్నీ విడతల వారీగా పూర్తిచేసి ఆయకట్టుకు నీరందించనున్నట్లు వివరించారు. కాళేశ్వరం కూలిపోయినా.. గత ఏడాది దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో పండనంత ధాన్యం తెలంగాణ రాష్ట్రంలో పండిందన్నారు. రైతును రాజు చేసే క్రమంలో కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రతినీటి బొట్టును ఒడిసి పట్టుకుని సాగుకు ఉపయోగపడేవిధంగా, ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోరలు చాస్తున్న సా'రాకాసి'

(5వ పేజీ తరువాయి)

ఏప్రిల్ వరకు 317కేసులు మాత్రమే నమోదయ్యాయి.

హైదరాబాద్ నుంచి రాకపోకలు

ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా స్థాయిలోని అధికారులు, కొంతమంది ఎక్సైజ్‌శాఖ సీఐల వరకు స్థానికంగా వారికి కేటాయించిన ఎక్సైజ్‌శాఖ స్టేషన్ పరిధిలో నివాసం ఉండటం లేదని గతేడాదిగా విమర్శలు వెలువడుతున్నాయి. ఏడాది క్రితం సీఐలకు బదిలీలు కాగా ఉమ్మడి జిల్లాకు బదిలీపై వచ్చిన అధికారులు ఇంకా స్థానికంగా కుటుంబాలను తరలించలేదు. హైదరాబాద్, వరంగల్, ఇతర ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్‌స్టేషన్‌లకు రాకపోకలు సాగిస్తున్నారు. వీకేండ్స్‌లో గుడుంబా, మత్తుపదార్థాలు అమ్మకాలు జోరుగా సాగుతుంటాయి. కానీ ఎక్సైజ్ శాఖ అధికారులు స్థానికంగా ఉండి రైడింగ్‌లు చేయకపోవటంతో కేసులు నమోదు కావటం లేదని బహిరంగ విమర్శలు వెలువడుతున్నాయి. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అనుదీప్ ఎక్సైజ్ శాఖపై పర్యవేక్షణ చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రంలో అరకొరగా 'సంక్షేమం' అమలు

(5వ పేజీ తరువాయి)

మతతత్వ రాజకీయాలు చేస్తోందని, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. పత్తి కొనుగోలులో ఈడీపీఎస్ విధానాన్ని కేంద్రం అమలులోకి తీసుకొచ్చి సీసీఐ ద్వారా కొనుగోలు బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు చూస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వంలో కాంగ్రెస్ అమలులోకి తీసుకొచ్చిన పోడు హక్కు చట్టాన్ని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయటం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో ఆదివాసీలను హత్యమార్చిందని, సమాజంలో ఉన్న ఆర్థిక, సామాజిక అసమానతలను కేంద్ర ప్రభుత్వం హతమార్చాలని ఆదివాసీలను కాదని ఘాటుగా ఖండించారు. జిల్లా కమిటీ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరావు, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, సీపై షుల్లయ్య, జీ రామయ్య, ఆవుల అశోక్ పాల్గొన్నారు.

ఆయనంతే.. సప'రేటు'!

(5వ పేజీ తరువాయి)

చేర్పించడం కొసమెరుపు. మరో వ్యక్తిని సైతం ఇదే తరహాల్లో ఉద్యోగంలో పెట్టించినట్టు ప్రచారం జరుగుతోంది. వారిని విధుల నుంచి తొలగించినట్టు లేఖలు ఇచ్చిన అనంతరం కూడా తిరిగి వారికి కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగంలో పెట్టించడం వెనుక భారీగా మామూళ్ల చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే గతంలో ఇష్టారీతిన ఉద్యోగాల నియామకాలు, ఇంటి నెంబర్లలో అవకతవకలకు పాల్పడ్డారన్న అంశాలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. కాగా మళ్లీ అదే రీతిలో అక్రమాలకు పాల్పడిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవడం వెనుక మతలబేంటన్న ప్రశ్న కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు రెవెన్యూలో అక్రమాలకు సంబంధించిన ఘటనలో తొలగించిన ఇద్దరు ఉద్యోగులకు సైతం తాను ముందుగా హామీ ఇచ్చి, ఉన్నతాధికారుల దగ్గరకు పంపినట్టు వినికిడి. ఇక పోతే ఇటీవల కాలంలో ఓ ఇద్దరు ఉద్యోగులను సైతం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగంలో చేర్పించారన్న ప్రచారం జరుగుతోంది.

అక్రమాల్లో హస్తంపై ఆరోపణలు

కొందరు ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టే సందర్భంలో సదరు ఉద్యోగి తనదైన శైలిలో వారిని కాపాడుతూ వస్తున్నారనే ప్రచారం జరుగుతుండగా దానికి కారణాలేంటన్న అంశాలపై ప్రస్తుతం చర్చ కొనసాగుతోంది. అయితే ఆయా అక్రమాల్లో ఆయన హస్తం కూడా ఉందన్న వాదన లేకపోలేదు. ఎస్ఆర్ గార్డెన్ సమీపంలోని ఓ స్థలానికి సంబంధించి ఆరువేల గజాలకు అసెస్‌మెంట్ వేసిన అంశంలో సదరు ఉద్యోగి ద్వారానే పైరవీ నడిచిందన్న ఆరోపణలు ఉన్నాయి. అందులో పెద్ద మొత్తంలోనే నగదు ముట్టిందన్న వాదన లేకపోలేదు. అంతేకాదు భవనాల అనుమతులు, ఎలాంటి గెజిట్‌లు లేకుండానే జనన ధ్రువీకరణ పత్రాల్లో మార్పులు చేయడంతో పాటు మ్యూటేషన్స్‌లో కూడా ఆయనకు తెలిసే అక్రమాలు జరిగిందన్న విమర్శలున్నాయి. అసలు సదరు ఉద్యోగి వరకు మాత్రమే పరిమితమైన డిజిటల్ కీలో తప్పులు జరిగినప్పుడు ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నది ప్రశ్నగా మారింది. కార్పొరేషన్‌కు సంబంధించి గతంలో 20 ల్యాప్‌టాప్‌ల వరకు కొనుగోలు చేయగా.. అందులో సగం ఇప్పుడు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. డిజిటల్ కీలకు సంబంధించి అక్రమాలు జరిగాయని ఉన్నతాధికారి దృష్టికి వెళ్లిన క్రమంలో రెవెన్యూలోని అధికారులకు ఆ ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని చెప్పగా.. ఈ విషయం వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. ఇవన్నీ పక్కన పెడితే ఉన్నతాధికారి దగ్గరకు వెళ్లాల్సిన కొన్ని లేఖలను సైతం సదరు అధికారి మాయం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సదరు అధికారిపై ప్రస్తుతం వచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపి చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

దుర్భరస్థితిలో 'దబ్బతోగు'

(5వ పేజీ తరువాయి)

రావటంలేదని అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

25ఏళ్ల క్రితం దబ్బతోగు ప్రాజెక్టు నిర్మాణం

అశ్వారావుపేట మండలంలోని దబ్బతోగులో 25ఏళ్ల క్రితం నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా దబ్బతోగు, దబ్బతోగు కాలనీ, వినాయకపురం కాలనీ, మల్లాయిగూడెం, నారాయణపురం గ్రామాల పరిధిలో సుమారు 900ఎకరాలకు సాగునీరందించేలా ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు ద్వారా భూగర్భజలాలు పెరగటంతో పాటు పుష్కలంగా నీరందేది. అప్పట్లో ఈ ప్రాంతంలో అన్నదాతకు వరప్రదాయినిగా ఉండేది దబ్బతోగు ప్రాజెక్టు. ప్రాజెక్టు ద్వారా ఏళ్లపాటు పంటలకు సరిపడా నీరందేది. ప్రాజెక్టుపై ఆధారపడి అనేకమంది సాగును చేపట్టేవారు. చేపల పెంపకానికి ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడింది.

శిథిలమైన షట్టర్లు.. నీరంతా వృథా

దబ్బతోగు ప్రాజెక్టు పరిస్థితి ప్రస్తుతం దారుణంగా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల షట్టర్లు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో భారీగా నీరు లీకవుతోంది. వర్షాకాలం ఆరంభమైన తరుణంలో ప్రాజెక్టులోకి నీరు చేరితే లీకేజీలతో నీరు నిల్వ ఉండే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. ఏటా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి నీరు అధికంగా వస్తోంది. ఈ ఏడాది కూడా భారీగా వరదనీరు చేరితే అడ్డుకట్ట వేసే వీలే ఉండదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలోనూ షట్టర్ల ద్వారా నీరు లీకవుతుండటంతో తాము ఎలాంటి అడ్డుకట్ట వేసినా ఆగటంలేదని రైతులు తెలిపారు. ఇక షట్టర్లు ఎక్కడిక్కడ పగిలిపోవటంతో వాటిని కిందికి దించే పరిస్థితి లేదు. గతంలో తుప్పు పట్టిన షట్టర్లు దించే సమయంలో ఇరువైపులా గోడలు బీటలు వారాయి.

ధ్వంసమైన ప్రాజెక్టు అలుగు

గతేడాది జులైలో వచ్చిన వరదలకు ప్రాజెక్టులోకి ఊహించని విధంగా వరదనీరు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతికి అలుగు భారీగా పొంగి దిగువ భాగంలో ఉన్న గైడ్‌వాల్ పూర్తిగా దెబ్బతిన్నది.





వరదలకు కొట్టుకుపోయిన అలుగు దిగువలో గైడ్‌వాల్, తుప్పుపట్టి శిథిలావస్థలో ఉన్న తూములు

అలుగు దిగువన భారీగా కోతలు ఏర్పడ్డాయి. దీంతో కాంక్రీట్ నిర్మాణాలు మధ్యకు పలిగి కొట్టుకుపోయాయి. ప్రస్తుతం ప్రాజెక్టు దిగువ భాగాన్ని చూస్తే ఇది ప్రాజెక్టేనా అనే అనుమానాలు రావటం ఖాయం. మరోసారి వరదలు వస్తే ఉన్న కొద్దిపాటి అలుగు, కాంక్రీట్ నిర్మాణాలు పూర్తిగా దెబ్బతింటాయి. అలుగు దెబ్బతింటే నీరు పొలాల్లోకి వెళ్లే అవకాశం ఉండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం మవుతుంది. ఇక ఆనకట్ట కూడా నడవలేని విధంగా మారింది. పెద్దపెద్ద చెట్లతో ఆనకట్ట ఆనవాళ్లే కోల్పోయేలా ఉంది.

పూర్తిస్థాయి మరమ్మతులు కరవు

ప్రాజెక్టు నిర్మించిన తరువాత దానికి పూర్తిస్థాయిలో ఏనాడు మరమ్మతులు చేసినా దాఖలాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా పూడికతీత, అలుగు మరమ్మతు పనులు చేపట్టారు. ఆ తరువాత ప్రాజెక్టుకు అవసరమైన చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ చెరువుల బాటలోనైనా మరమ్మతులు చేస్తారని రైతులు ఎదురుచూసినా ఈ పథకంలోనూ చోటుదక్కలేదు. ప్రస్తుతం ప్రాజెక్టులో పూడిక బాగా పెరిగిపోయింది. దీంతో ప్రాజెక్టులోకి నీరు చేరినా నిల్వ ఉండే అవకాశం లేదు. ఉన్న నీరు కూడా లీకేజీల రూపంలో బయటకు వెళుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా భవిష్యత్‌లోనైనా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తేనే భవిష్యత్‌లో అన్నదాతలకు సరిపడా నీరు అందుతుందని కర్షకులు అభిప్రాయపడుతున్నారు. పాలకులు, అధికారులు ప్రాజెక్టు పూర్తిస్థాయి మరమ్మతులు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు.

షట్టర్లకు నిధులు మంజూరు

బి.కృష్ణ, ఐబీ డీఈఈ

ప్రాజెక్టు వద్ద రెండు షట్టర్ల మరమ్మతులకు రూ.1.40లక్షలతో ప్రతిపాదనలు పంపగా అనుమతులు వచ్చాయి. త్వరలో పనులు చేపడతాం. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే అలుగు, ఇతర పనులు పూర్తి చేస్తాం.

ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలి

» టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

కొత్తగూడెం అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించి పాఠశాలలను బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.మురళీమోహన్ ఆధ్వర్యంలో టీచర్స్‌భవన్‌లో ఆదివారం భద్రాద్రి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 700 ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, హైస్కూల్స్‌లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉందని, డీఈవో, ఎంఈవో డిప్యూటీ ఈవోల పోస్టులను ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి భర్తీ చేయాలన్నారు. 2023 జులై 1నుంచి పీఆర్సీ పెండింగ్‌లో ఉందని, ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునేషన్ చెల్లించాలని, కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ఉపాధ్యాయులకు 17శాతం హెచ్ఆర్ఏ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి యం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఎం.రాజయ్య, హథిరాం, డి.తావురియా, పి.జయరాజు, ఎం.పద్మారాణి, కే.గంగాదర్, ఆర్. రమేష్ కుమార్, ఎస్.విజయ్‌కుమార్, ఎస్కే యాకుబ్ పాషా, బి.రాంబాబు, బి.రాము, గంగాధర్, రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, వీరు, విజయభాస్కర్, జానకి, సత్యశ్రీ, సిల్వియా, శ్రీనివాసరావు, మాన్ సింగ్, వెంకటేశ్వర్లు, బాలు, రాం దాస్, రామకృష్ణ, మీరా హుస్సేన్, కిషోర్ పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాలో 5,278 కేసుల పరిష్కారం

కొత్తగూడెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మెగాలోక్ అదాలత్ సందర్భంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన అండర్ ఇన్వేస్టిగేషన్, కోర్టు విచారణలో ఉన్న కేసులు 803, డ్రంకెన్‌డ్రైవ్, ఎంవీ యాక్టు కేసులు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులు 4,009, ఈ పెట్టి కేసులు, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన, తదితర కేసులు 466 మొత్తం 5,278 కేసులు పరిష్కారం అయ్యాయని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది గత వారం రోజుల నుంచి కేసుల్లో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి రాజీమార్గం రాజమార్గమని లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని అగాహన కల్పించచడం పట్ల ఈ కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. లోక్ అదాలత్ ద్వార ఈ కేసుల పరిష్కారానికి ప్రతిభ చూపిన అధికారులు, కోర్టు డ్యూటి ఆఫీసర్లకు తగిన రివార్డులను అందచేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో నమోదైన 226 సైబర్‌క్రైమ్ కేసులను పరిష్కరించి ఈ కేసుల్లో నగదును కొల్పోయిన బాధితులకు రూ.60,11,992ల నగదును కోర్టు ద్వారా అందచేయడం జరుగుతుందని తెలిపారు.

గిరిజన జిల్లా అభివృద్ధి సాధకుడు



» భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్ బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది పూర్తి

» పాలనలో తనదైన శైలితో పథకాల అమలు

కొత్తగూడెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను వివిధ రంగాల్లో అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తూ, పాలనలో తనదైన శైలీతో ఉత్తమంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు మరిన్ని సేవలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అందచేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్ బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది కాలం పూర్తి చేసుకున్నారు. 2024 జూన్16న కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి జిల్లా అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. పేద ప్రజలకు విద్యా, వైద్యం, సంక్షేమ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూనే ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా పకడ్బందీగా, సమర్థవంతమైన పాలనను జిల్లా కలెక్టర్ అందజేస్తున్నారు. జిల్లా పాలనను స్వీకరించిన అనంతరం వ్యవసాయం, విద్య, వైద్య వ్యవస్థలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

మునగసాగు, ఫామాయిల్‌కు ప్రోత్సాహం

కలెక్టర్ వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు వివిధ మార్గాలను అన్వేషించి జిల్లాలో మునగసాగుకు ప్రోత్సహిస్తూ అనేక మండలాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మునగసాగు ద్వారా తక్కువ పెట్టుబడి, అధిక ఆదాయాన్ని పెంచుకోవచ్చని రైతులకు తెలిపారు. ఫామాయిల్ తోటలను విస్తరించాలని, రైతులు ఫామాయిల్ ద్వారా అధిక ఆదాయాలను గడించాలని కూడా రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు అధికంగా అభివృద్ధి సాధించేందుకు ఒకే పంటపై ఆధారపడకూడదని అంతర్ పంటల సాగు ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందాలని రైతులకు వివరించారు. పెరటికోళ్ల పెంపకం, తేనటీగల పెంపకం, పుట్టగొడుగుల వంటి సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను చైతన్యవంతులను చేస్తున్నారు.

జాతీయగుర్తింపు దిశగా భద్రాద్రి జిల్లా

జిల్లాలో భౌగోళిక శాస్త్రంపై ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకుని ప్రపంచంలోనే రెండోదిగా ఎర్త్‌సైన్స్ యూనివర్శిటీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంజూరు కావడంలో జిల్లా కలెక్టర్ తీసుకున్న చొరవ ప్రశంసనీయమని చెప్పవచ్చు. ఇది భవిష్యత్ విద్యార్థులకు ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందించేలా మారనుంది. ఇవే కాకుండా జిల్లా వ్యాప్తంగా దేశం మొత్తం జిల్లా వైపు చూసేలా ఇంకుడుగుంతల ఉద్యమాన్ని సైతం చేపట్టారు. పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో కూడా కృషి చేస్తున్నారు.. జిల్లాలో మట్టి ఇటుకలతో ప్రహరీ నిర్మాణ ప్రారంభాన్ని కూడా చేపట్టారు. గిరిజన సంస్కృతి చాటిన యేరు పెస్టివల్‌ను భద్రాద్రిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆచారాల వ్యవహారాలు, సాంస్కృతిక విలువలు పెస్టివల్‌ను నిర్వహించారు.

చేపల పెంపకంతో వెలుగులు..

చేపల పెంపకాన్ని కేవలం చెరువులకే పరిమితం చేయకుండా వ్యవసాయ క్షేత్రంలోని ఫామ్‌పొండ్‌లలో చేపల పెంపకాన్ని ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇది జిల్లా వ్యవసాయ విధానంలో సమగ్ర వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వినూత్న నిర్ణయంగా నిలిచింది. ప్రతి రైతు పొలం వద్ద ఏర్పాటు చేసిన నీటి సంరక్షణ గుంతలను కేవలం సాగునీటి ఉద్దేశానికే కాకుండా చేపల పెంపకానికి ఉపయోగించుకోవాలనే ఆలోచనతో కలెక్టర్ మార్గదర్శకాలను జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుంటూ కలెక్టర్ రాత్రి సమయంలో ఆ పాఠశాలలో బస చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పాఠశాలల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కావాల్సిన ప్రణాళికలను రూపొందించారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడమే కాకుండా జిల్లాలో ఇప్పటికే మూడు యంగ్‌ఇండియా ఇంటర్నేషన్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేయడంలో కీలకపాత్ర పోషించారు.

ఆరోగ్యరంగాన్ని మెరుగుపరిచే దిశగా అడుగులు

మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సమగ్రవైద్యం అందించేందుకు కలెక్టర్ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆకస్మీక తనిఖీలు నిర్వహిస్తూ అందుబాటులో ఉన్న వసతులపై సమీక్షలు చేపడుతున్నారు. వైద్య సేవల నాణ్యత మెరుగుపరిచే దిశగా అవసరమైన ఆధునికీకరణ వైద్యంపై కూడా దృష్టి సారించారు. ఇవే కాకుండా పర్యావరణ పరిరక్షణ, ఔషధ మొక్కలపై ప్రజలకు అవగాహన తదితర అంశాలపైన దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున ప్రజలకు ఉపయోగపడే మొక్కలను మాత్రమే నాటడానికి సిద్ధం చేస్తోన్నారు.



మట్టి ఇటుకలు తయారు చేసిన సమయంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ (ఫైల్)

జిల్లా అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పని చేస్తూ

జిల్లా అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పని చేస్తూ ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటికి తక్షణమే పరిష్కారం చూపే విధంగా కలెక్టర్ విశేషంగా కృషి చేస్తోన్నారు. ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యవసరాలపై తక్షణ స్పందన, అధికార యంత్రాంగం పట్ల సమన్వయం, ప్రజల భాగుపై ప్రత్యేక శ్రద్ధను చూపుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో పకడ్బందీగా పర్యవేక్షణతోపాటు ప్రతిశాఖ పని తీరును నిరంతరం సమీక్షిస్తూజిల్లా అభివృద్ధిని నడిపిస్తోన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజల అభ్యంతరాలపై స్పందిస్తూ వారికి ప్రభుత్వం అందిస్తున్న సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా శ్రమిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజల మన్ననలను ఎంతగానో పొందుతున్నారని చెప్పవచ్చు.

ప్రకృతి వ్యవసాయానికి నూతన చైతన్యం..

జిల్లాలో ప్రకృతి వ్యవసాయానికి నూతన దిశగా అందిస్తూ జిల్లా కలెక్టర్ స్వయంగా బయోచాయ్ తయారీని ఆచరణలో చూపించి రైతులకు ప్రేరణ ఇస్తున్నారు. సేంద్రీయ పద్ధతిలో మట్టిలో పోషకాలు అందిస్తూ దిగుబడులు పెంచే బయోచాయ్ తయారీ పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి, రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ఆశ్రయించి ఆర్థికంగా ముందుకు సాగాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కృష్ణ(ఫైల్)

తల్లాడ, జూన్15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం తల్లాడ సమీపంలో డాంబర్ ప్లాంట్ వద్ద జరిగింది. ఆదివారం తెల్లవారుజామున తల్లాడకు చెంది చల్లా కృష్ణ (63) ఇంటి వద్ద నుంచి టీవీఎస్‌మోపెడ్‌పై ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని తన పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. కృష్ణకు భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులున్నారు. కృష్ణ కుమారుడు నాగులు బీజేపీ తల్లాడ మండల కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. మృతుడి కుమారుడు నాగులు ఫిర్యాదుమేరకు తల్లాడ ఎస్‌ఐ వెంకటకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కృష్ణ మృతదేహాన్ని జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, జిల్లానాయకులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

వ్యాన్ బోల్తా: నలుగురికి గాయాలు

బూర్గంపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ధాన్యం లోడుతో వెళుతున్న మిని వ్యాన్ బోల్తా పడిన ఘటనలో నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని గౌతపురం కాలనీకి చెందిన ఏనిమిది మంది కూలీలు సారపాకలోని ఓ మిల్‌లో పని చేస్తున్నారు. ఆదివారం మిని వ్యాన్‌లో ఉడ్‌యార్డు నుంచి సారపాకకు ధాన్యం లోడుతో వెళుతుండగా లక్ష్మీపురం శివారులో ప్రమాదవశాత్తు వారు ప్రయాణిస్తున్న వ్యాన్ బోల్తా పడింది. దీంతో నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు మోరంపల్లిబంజర పీహెచ్‌సీకి అక్కడ నుంచి భద్రాచలం తరలించారు. గాయపడిన వారిలో నాగరాజు, నాని, నర్సయ్య, నర్సింహ ఉన్నట్లు తెలిపారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం తరలించగా మిగిలిన ముగ్గురు కూలీలు భద్రాచలంలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లక్ష్మీనగరంలో దొంగనోట్ల కలకలం..?

దుమ్ముగూడెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరంలో దొంగనోట్ల మార్పిడి కలకలం సృష్టించింది. నకిలీ రూ.500లు, రూ.100ల దొంగ నోట్ల విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. లక్ష్మీనగరం, ములకపాడుల్లోని రెండు వేర్వేరు దుకాణాల వద్దకు రూ.100, రూ.500ల దొంగ నోట్లు రాగా యజమానులు వాటిని గుర్తించి తమ వద్ద నిలిపివేశారు. గతంలోనూ లక్ష్మీనగరంలోని ఓ బ్యాంకు వద్దకు దొంగనోటు రాగా, దానిపై ఎర్ర ఇంకుతో ఫేక్ నోట్ అని రాసి వినియోగదారునికి ఇచ్చిన సందర్భం ఉంది. దొంగనోట్ల చలామణి విషయం తెలవగానే దుకాణదారులు అప్రమత్తమయ్యారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



సత్తుపల్లిరూరల్, మే15 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకు న్నారు. స్థానిక ద్వారకాపూరి కాలనీ రోడ్ నెంబర్- 2,7లలో లబ్ధిదారుల నుంచి రూ.12కు కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా తాము దాడి చేసి పట్టుకున్నట్లు గిర్దావర్ ఎస్‌కే.జానీ తెలిపారు. రోడ్ నెంబర్-2లో కొడాలి రమేష్ వద్ద 2క్వింటాళ్ళు, రోడ్ నెంబర్-7లో గజ్జల చంద్రకళ వద్ద 4క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆటోను స్థాని క పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి బలవన్మరణం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన ఆదివారం నగరంలో జరిగింది. ఖమ్మం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగుడెం జిల్లా మణుగురుకు చెందిన బెల్లంకొండ లక్ష్మయ్య(50) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.

కాగా అతడిని కుటుంబ సభ్యులు శనివారం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అనారోగ్యంతో మనస్తాపం చెందిన లక్ష్మయ్య ఆదివారం సాయంత్రం క్షయ వ్యాధి కేంద్రంలోని ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాజీవ్ స్వగృహ ఇళ్లు గెజిటెడ్ ఉద్యోగులకు కేటాయించాలి

» తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ ప్లాట్లను గెజిటెడ్ ఉద్యోగులకు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయాన్ని వెల్లడించాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో ఆదివారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అసోసియేషన్ హౌస్ బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు కట్టా కిషోర్, కార్యదర్శి డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీఎన్జీవో సభ్యులకు ప్రభుత్వం ఇండ్ల నిర్మాణం కోసం స్థలాలు ఇచ్చిందని అదే సందర్భంలో 2011లో ఖమ్మం జిల్లాలో తొలిసారిగా గెజిటెడ్ అధికారులకు హౌస్ బిల్డింగ్ సొసైటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వలన గెజిటెడ్ అధికారులు నష్టపోయినట్లు చెప్పారు. ప్రజాపాలన వచ్చిన తర్వాత గెజిటెడ్ ఉద్యోగులకు ఇండ్ల స్థలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు పెండింగ్‌లో ఉండటం వలన స్థలాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. పోలేపల్లి రెవెన్యూ పరిధిలోని రాజీవ్ స్వగృహ ప్లాట్లను గెజిటెడ్ ఉద్యోగులకు కేటాయించేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వివరించినట్లు తెలిపారు. దీనిపై సానుకూల స్పందన వచ్చిందన్నారు. గెజిటెడ్ ఉద్యోగులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేలా సొసైటీ కృషిచేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కట్టా కిషోర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఉన్న గెజిటెడ్ అధికారులు ఇంకా సభ్యత్వం తీసుకొననీ వారు ఎవరైనా ఉంటే వెంటనే తీసుకోవాలని కోరారు. సమావేశంలో పలు అంశాలు మీద తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీజీవో జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి, ట్రెజరర్ కొండపల్లి శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ మహేష్‌బాబు, ట్రెజరర్ రమేష్, డైరెక్టర్స్ డాక్టర్. సంజయ్, పి.సుధారాణి టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, బుల్లెట్ శ్రీనివాస్, మన్యం రమేష్ బాబు, కనపర్తి వెంకటేశ్వర్లు, మల్లెల రవీంద్ర ప్రసాద్, భాస్కరరావు, హరీష్, రాంబాబు, బాలాజీ, డాక్టర్ నంద్రు గోపి, పుష్పరాజు, మాధవరావు, బాబుజాన్, సంజీవుడు, వెంకటేశ్వర్లు, కనకదుర్గ, ఏడుకొండలు పాల్గొన్నారు.



హాజరైన ఉద్యోగులు

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష నాయకులు

ఇల్లెందు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అడవుల్లోని ఖనిజ నిక్షేపాలను, వనరులను కార్పొరేట్లకు కట్టపెట్ట చూసే ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో జూన్ 17న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో అఖిలపక్షాల ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టు పార్టీతో వెంటనే శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. జూన్ 17న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎండి. రాసుద్దీన్, కొక్కు సారంగపాణి, కొప్పుల శ్రీనివాస్, బొగ్గరపు రాజు, సీపీఐ నాయకులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, సీపీఎం నాయకులు ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, టీడీపీ నాయకులు చందావత్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో

వేధిస్తున్న సిబ్బంది కొరత

» స్టేషన్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న 35 మంది సిబ్బంది

మణుగూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మణుగూరు మండలంలో పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా మణుగూరు పోలీసు స్టేషన్ అభివృద్ధి చెందకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ స్టేషన్ పరిధిలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనులు, 20 కార్మిక వాడలు, 30 పల్లెలు రెండు పట్టణ ప్రాంతాల్లో దాదాపు లక్ష జనాభా ఉన్నారు. కార్మిక సమ్మెలు, కార్మిక వాడల్లో గొడవలు, కాక మణుగూరు రూరల్ ఏరియాలో నక్సల్స్ కార్యకలాపాలు కూడా సాగుతుంటాయి. ఇటువంటి క్లిష్టమైన ప్రాంతంలో పోలీసు సిబ్బంది సరిపడనంత లేరనే తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రతి వేయి మందికి ఓ పోలీసు కానిస్టేబుల్ ఉండాలి. మణుగూరు జనాభా లెక్కల ప్రకారం మూడు వేల మందికి ఓ కానిస్టేబుల్ కూడా లేరు.

ప్రస్తుతం స్టేషన్‌లో 28 మంది కానిస్టేబుల్స్ , హెడ్ కానిస్టేబుల్ ఒక్కరు, ముగ్గురు ఏఎస్ఐలు, ఇద్దరు ఎస్ఐలు, ఓ సీఐ ఉన్నారు. ఇంకా అదనపు సిబ్బందిని నియమిస్తే చాలా వరకు వెసులు బాటుగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న పోలీసు సిబ్బందిలో నలుగురు మహిళా కానిస్టేబుల్స్, ఇద్దరు మహిళా ఏఎస్ఐ లు ఉన్నారు. మణుగూరులో కుటుంబ కలహాలు భార్యభర్తల గొడవలు, మహిళా సంబంధిత కేసులు అధికంగా ఉంటాయి. మహిళా పోలీసు సంఖ్యను పెంచితే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల మణుగూరు పట్టణంలో దొంగతనాల జోరు కూడా అధికమైంది. పట్టపగలే దొంగతనాలు విపరీతంగా జరుగుతున్నాయి. మణుగూరు ప్రాంతం పదికిలో మీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. ఈ స్టేషన్‌కు అదనపు సౌకర్యాలు కల్పిస్తే మరింత పకడ్బందీగా పోలీసులు వ్యవహరించగలరు. అరకొరగా నిర్మించిన పోలీసు క్వార్టర్లు కూడా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఒక్క కానిస్టేబుల్ కూడా నివాసముండటం లేదు. పోలీసు సిబ్బంది అంతా అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. మండల జనాభాకు అనుగుణంగా పోలీసుల సంఖ్యను పెంచాలని సిబ్బందికి క్వార్టర్లు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



శిథిలమైన పోలీసు నివాస గృహాలు



మణుగూరు పోలీసు స్టేషన్

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రికి తలకొరివి పెడుతున్న కుమార్తె

దమ్మపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తండ్రికి తలకొరివి పెట్టిన ఘటన మండలంలోని నాగుపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. నాగుపల్లికి చెందిన కునసోతు రామకృష్ణ(40) మిషన్ కుడుతూ, భార్య రమణ కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడు రోజుల క్రితం రామకృష్ణకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె శ్రావిక కార్యక్రమాలు నిర్వహించింది. శ్రావిక రోధిస్తూ తలకొరివి పెడుతున్న ఘటనను చూసి గ్రామస్థులు కంటతడి పెట్టారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్‌ను అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లికి చెందిన పాఠకుల రిషిత అనే ప్రయాణికురాలు పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్‌ను భద్రాచలం ఆర్టీసీ స్టేషన్ మేనేజరు అల్లం నాగేశ్వరరావు ఆదివారం బాధితురాలికి అందజేశారు. వివరాల ప్రకారం..రిషిత భద్రాచలం డిపోకు చెందిన కొత్తగూడెం వెళ్లే బస్సులో ప్రయాణిస్తుండగా ఫోన్ పోగొట్టుకుంది. ఈ క్రమంలో ఓ ప్రయాణికురాలికి దొరకకగా వారు ఫోన్‌ను తీసుకువచ్చి ఆర్టీసీ ఎస్ఎంకు అందజేశారు. దీంతో ఆ ఫోన్‌కు వచ్చిన ఫోను నెంబర్ల ఆధారంగా వారికి సమాచారం అందించారు. వారిని భద్రాచలం వచ్చి తీసుకోమని ఎస్ఎం కోరారు. ఈ క్రమం లో రిషిత భద్రాచలం వచ్చి తన ఫోన్‌ను తీసుకున్నారు. ఇదిలా ఉండగా భద్రాచలం ఆర్టీసీ బస్టాండు శుభ్రం చేస్తున్న సమయంలో ఆర్టీసీ ఉద్యోగిని లక్ష్మీకి రూ.10 వేలు ఉన్న పర్సు శనివారం లభ్యం కాగా, స్టేషన్ మేనేజరు అల్లం నాగేశ్వరరావుకు అందజేసింది. ఈ పర్సును లక్ష్మి చేతుల మీదుగా పర్సు పోగొట్టుకున్న గుంటూరుకు చెందిన పాలడుగు శివకు అందజేశారు. చిరు ఉద్యోగి అయినా తన నిజాయితీని చాటుకోవడం పట్ల లక్ష్మిని అధికారులు, ప్రయాణికులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో

మహిళ మృతి

వైరా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ద్విచక్రవాహనంపై నుంచి పడిపోయి రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. బోనకల్ మండలం కలకోట గ్రామానికి చెందిన కోపిల మరియమ్మ(35) ఆదివారం అనుమానాస్పద స్థితిలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందింది. సురేష్, మరియమ్మ దంపతులు ద్విచక్రవాహనంపై కొణిజర్ల మండలంలోని సీతారాంపురంలో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరయ్యారు. అక్కడి నుంచి తిరిగి తమ స్వగ్రామం అయిన కలకోటకు వెళ్తున్న సమీపంలో గొల్లపూడి-పాలడుగు గ్రామాల మధ్య అష్టగుర్తి వెళ్లే మట్టి రోడ్డు సమీపంలో మరియమ్మ ద్విచక్రవాహనంపై నుంచి రోడ్డుపై పడిపోయి తలకు తీవ్రగాయాలయ్యాయి. భర్త సురేష్ నెట్టి వేయడంతోనే మరియమ్మ కింద పడిపోయి తీవ్రగాయాలై 108వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందిందని ఆమె తరఫు బంధువులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్యభర్తల మధ్య జరుగుతున్న వివాదాల నేపథ్యంలోనే ఈ రోడ్డు ప్రమాదం జరిగి ఆమె మృతిచెందిందని బంధువులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుభరోసా కోసం దరఖాస్తుల ఆహ్వానం



ఏవో వాణి

కూసుమంచి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొత్తగా పాస్‌బుక్ పొందిన రైతులు రైతు భరోసాకోసం దరఖాస్తు చేసుకోవాలని కూసుమంచి మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి కోరారు. వానాకాలం 2025-26 సంవత్సరానికి సంబంధించి ఈఏడాది జూన్ 5తేదీనాటికి భూభారతిలో పాస్‌బుక్ పొందిన లేదా డిజిటల్ సైన్ అయిన రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి భూమి పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జీరాక్స్ కాపీలు అందించాలని కోరారు.

గ్యాంగ్ వర్క్‌కు గ్రహణం



గ్యాంగ్ వర్క్ చేస్తున్న కార్మికులు

» మున్నేరు వరదల అనుభవంతో ఏర్పాటు
» ప్రారంభంలో పారిశుధ్యంలో మంచి ఫలితాల సాధన
» ఇప్పుడు రోజుకు 15నుంచి 20 మంది కార్మికుల డుమ్మా
» వర్షాలు కురవటంతో సీజనల్ వ్యాధులు విజృంభన
» పారిశుధ్య పర్యవేక్షకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వరకు ఇతర జిల్లాల నుంచి రాకపోకలు

ఖమ్మం సంక్షేమవిభాగం,జూన్15(ఆంధ్రజ్యోతి): మున్నేరు వరదల విపత్తుల అనుభవంతో వినూత్నంగా ఏర్పాటు చేసిన కేఎంసీ పారిశుధ్య కార్మికుల గ్యాంగ్ వర్క్‌కు గ్రహణం పట్టింది. ప్రారంభంలో మంచి పారిశుధ్య ఫలితాలనిచ్చింది. శ్రీశ్రీసర్కిల్ నుంచిఎన్టీఆర్ సర్కిల్ వరకు, ఖమ్మం బైపాస్ రోడ్డు, కాల్వొడ్డు, వైరా రోడ్డు, ముస్తాఫానగర్ ప్రధాన రహదారులను గ్యాంగ్ వర్క్ యుద్ధప్రాతిపదికన పనులు చేసి శభాష్ అనిపించుకున్నారు. ఒకేసారి 80నుంచి 100 మంది కార్మికులు ఒకేప్రాంతంలో పనులు చేపట్టటంతో ఎంతటి గుట్టలా పేరుకుపోయిన డ్రైనేజీలైన ఇట్టే శుభ్రం చేశారు. ఖిల్లా గుట్టను సైతం క్లీన్ చేసి శభాష్ అనిపించుకున్నారు.

పర్యవేక్షణ లేక విధులకు డుమ్మా

కొంతకాలంగా గ్యాంగ్‌వర్క్‌కు గ్రహణం పటినట్లుంది. గ్యాంగ్ వర్క్ బృందాన్ని నాల్గు బృందాలుగా విభజన చేశారు. ఒక్కోబృందంలో 20మందితో ఏర్పాటు చేశారు. వారిని పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు వారివెంట లేక పోవటంతో కనీసం హాజరు పరిశీలించేవారే కరవయ్యారు. నిత్యం 15నుంచి 20 మంది వరకు సెలవ్ అంటూ పెట్టి తర్వాత హాజరు నమోదు చేసుకుంటున్నారు. ఇక మిగిలిన వారు ఒక గంట పనులు చేసి ఇంటిదారి పడ్తున్నారు.బృందాలను పర్యవేక్షణ చేయాల్సిన అసిస్టెంట్ కమిషనర్, పారిశుధ్య పర్యవేక్షకులు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు వరంగల్, హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

అమలు కాని ఆదేశాలు

ఖమ్మం నగరంలో పారిశుధ్య పర్యవేక్షకులు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, జవాన్లపై అనేక విమర్శలు రావటంతో పారిశుధ్య కార్మికుల హాజర్ని పర్యవేక్షణ చేసే బాధ్యతలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆయా డివిజన్ల వార్డు ఆఫీసర్లకు కేటాయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల హాజర్ని కూడా పరిశీలించాలని హాజరు నమోదు, సమయ పాలన పాటించాలని గత నెలలోనే కమిషనర్ అభిషేక్ అగస్త్య వార్డు ఆఫీసర్లకు రాతపూర్వకంగా ఆదేశాలిచ్చారు. కానీ ఆ మేరకు వార్డు ఆఫీసర్లు ఎక్కడా హాజరు నమోదు, పారిశుధ్య పనుల సమయ పాలన పర్యవేక్షణ చేయటం లేదు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకముందే పారిశుధ్య పనులను గాడిలో పెట్టాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంరూరల్,జూన్15(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని గుదిమళ్లలోని వ్యవసాయ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ. ప్రభాకర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుదిమళ్ల తోపాటు,వెంకటగిరి ఈరెండు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నేడు వరదలపై అవగాహన సదస్సు

ఖమ్మంరూరల్, జూన్15(ఆంధ్రజ్యోతి):ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో వరద సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించనుందని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజలు హాజరు కావాలని సూచించారు.

యోగాతో ఆరోగ్యం, ఆనందం



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మంస్పోర్ట్స్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంతో పాటు ఆనందం సిద్ధిస్తుందని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజులో అర గంట సమయం కేటాయించి యోగాసనాలు సాధన చేస్తే వారిలోని మానసిక వత్తిడి దూరమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు యర్రా రమేష్, యోగా మాస్టర్ కోదండరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

నేలకొండపల్లి,జూన్15(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర డిప్యూటి సీఎం మల్లు భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో కేక్ కట్ చేసారు. పేదలకు, వృద్ధులకు రొట్టెలను, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెర్రిపోతుల అంజని, బొడ్డు బొందయ్య, బచ్చలకూర నాగరాజు, బోయిన వేణు, మీసా ముత్తయ్య, దోసపాటి చంద్రశేఖర్, షేక్.సోందు మియా,ఆర్ఎంపీ, సూరేపల్లి రామారావు, కైలాసపు వెంకటేశ్వర్లు, దండా సత్యనారాయణ, గుడిబోయిన వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సుబ్బయ్య, గోపి, రెడిమల్ల బాబుల్‌రెడ్డి, కనమర్లపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్యంపై మక్కువ పెంచుకోవాలి

త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు



ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్15 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు భరతనాట్యంపై మక్కువ పెంచుకోవాలని త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు అన్నారు. ఆదివారం నగరంలోని నటరాజ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్య పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు, కాంగ్రెస్ నాయకులు యర్రం బాలగంగాధర తిలక్ హాజరయ్యారు. దేవాలయాలలో నృత్యంగా ప్రారంభమై ఇతి వృత్తాలను, భక్తిని వ్యక్త పరుస్తుందన్నారు. అనంతరం ప్రతిభచూపిన చిన్నారులకు బహుమతులు అందించారు.

కరెంట్ స్తంభాల మధ్యే రోడ్డు నిర్మాణం



వైరా,జూన్15 (ఆంధ్రజ్యోతి): వైరాలో అత్యంత కీలకమైన రిజర్వాయర్ రోడ్డు నిర్మాణ పనులపై స్థానికులు పెదవిరుస్తున్నారు. అసలే ఇరుకుగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు మధ్యలో ఉన్న కరెంట్ స్తంభాలను తొలగించకుండా చేస్తున్న నిర్మాణంపై స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. వైరా రిజర్వాయర్‌కు అలాగే పర్యాటక కేంద్రానికి ఎంతో కీలకమైన ఈ రోడ్డు నిర్మాణంపై మొదటి నుంచి వివాదాలు రేగుతున్నాయి. 80నుంచి 100అడుగుల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డు ఆక్రమణలతో కుచించుకుపోయింది. ఈ కుచించుకుపోయిన రోడ్డుపైనే రూ.80లక్షల సుడా నిధులతో పనులు చేపట్టారు. 52నుంచి 57అడుగుల వెడల్పుగా అధికారులు నిర్ధారించి హడావిడిగా పనులు చేసి చేతులు దులుపుకునేందుకు తీవ్ర ప్రయాసపడుతున్నారు. గతంలో 57నుంచి 60అడుగుల వెడల్పుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్ధారించారు. ఇప్పుడు అది కాస్తా 52నుంచి 57అడుగుల వెడల్పుకు తగ్గిపోయింది. ఈ రోడ్డుపైన కొద్దిరోజుల కిందటి వరకు 26అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. రోడ్డు మధ్యలో రెండు అడుగులతో డివైడర్‌కు రెండువైపులా 12అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. అయితే ఈ రోడ్డు నిర్మాణం అత్యంత ఇరుకుగా ఉందని తమ దృష్టికి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మునిసిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. డివైడర్‌కు ఇరువైపులా కనీసం 15అడుగుల చొప్పున వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ఆదేశించారు. ఇప్పుడు ఇరువైపులా ఐదు నుంచి ఆరు అడుగుల వెడల్పు పెంచి రోడ్డు నిర్మిస్తున్నారు. ఓవైపు రోడ్డుపైనే కరెంట్ స్తంభాలున్నాయి. ఆ స్తంభాలను తొలగించకుండా వాటి మధ్యలోనే రోడ్డు నిర్మిస్తున్నారు. వెడల్పు పెంచిన రోడ్డు మొత్తం కరెంట్ స్తంభాల మధ్యలోనే ఉంది. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి కరెంట్ స్తంభాలను తొలగించకుండానే వాటి మధ్యలోనే ఈ రోడ్డు నిర్మిస్తుండడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కరెంట్ స్తంభాలు తొలగించకుండా రోడ్డు వెడల్పు పెంచినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం రోడ్డు వెడల్పు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించగా ఆయనను సంతృప్తి పర్చేందుకు వెడల్పు పెంచిన అధికారులు కరెంట్ స్తంభాలు తొలగించే విషయంలో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కరెంట్ స్తంభాలు తొలగించి ఆ తర్వాతే రోడ్డు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

18న రైతు అవగాహన సదస్సు

నేలకొండపల్లి,జూన్15(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 18న నేలకొండపల్లి వాసవీ భవన్‌లో రైతు అవగాహనా సదస్సును నిర్వహించనున్నట్లు రైతు సదస్సు ఛైర్మన్ చావా గణపతిరావు, వైస్‌ఛైర్మన్ యలమద్ది లెనిన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సదస్సులో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు, విషయ నిపుణులు యాజమాన్య పద్ధతులు, సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కలిగిస్తారని చెప్పారు. వివిధ పంటలపై రైతుల సందేహాలకు సమాధానాలిస్తారని తెలిపారు. సదస్సులో యంత్ర పరికరాలు, జీవ ఎరువుల ప్రదర్శన ఏర్పాటు చేస్తారని తెలిపారు. పాలేరు నియోజకవర్గానికి చెందిన రైతు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతు అవగాహనా సదస్సును విజయవంతం చేయాలని చావా గణపతిరావు, యలమద్ది లెనిన్ కోరారు. సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు, కార్యదర్శి గెల్లా వెంకట రమణగుప్తా, కోశాధికారి దండా రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి ప్రకటన విడుదల చేసిన వారిలో ఉన్నారు.

పాఠశాల బస్సులు పూర్తి ఫిట్‌గా ఉండాలి

నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్



నేలకొండపల్లి, జూన్15(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల బస్సులను పూర్తి కండిషన్‌లో ఉంచుకోవాలని, కండిషన్‌లో లేని బస్సులను వినియోగించరాదని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. ఈమేరకు ఓప్రకటన విడుదల చేశారు. యాజమాన్యాలు కండిషన్‌లో లేని బస్సులను నడిపి, ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సుల కండీషన్‌ను ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటుండాలన్నారు. పాఠశాల బస్సుల్లో సైతం పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించ వద్దన్నారు. బస్సులకు సీనియర్ డ్రైవర్లను నియమించుకోవాలని, బస్సుల వేగాన్ని నియంత్రించాలన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి చేస్తున్నాం.. ఆదరించండి

» ప్రతీ గ్రామానికి సాగు, తాగునీరు
» రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బచ్చోడులో ర్యాలీలో పాల్గొన్న పొంగులేటి

తిరుమలాయపాలెం,జూన్15(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉండి అభివృద్ధి చేసిందని, ఈప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బచ్చోడు, రాజారం, సోలీపురం, కాకరవాయి తదితర గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. గతబీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల వారికి అన్యాయం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ పాలనలో ప్రజలకు అన్నివిధాలుగా మేలు జరుగుతుందన్నారు. రైతులకు మేలు చేయాలని ప్రభుత్వం భూభారతి చట్టం ప్రవేశ పెట్టిందన్నారు. బచ్చోడులో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ, ఏడీఏ బి.సరిత, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్,రాష్ట్ర మహిళ మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి ఏఎంసీ వైస్‌ఛైర్మన నరేందర్‌రెడ్డి, మాజీఎంపీపీ మంగీలాల్, రామసహాయం అరవిందరెడ్డి, గూడూరు వెంకన్న, బుద్దకనకయ్య పాల్గొన్నారు.

అలరించిన 'అనశ్వరం' నాటిక



ఖమ్మంఖానాపురంహవేలి, జూన్(ఆంధ్రజ్యోతి): నెలనెల వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన అనశ్వరం నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.శ్రీకృష్ణ తెలుగు థియేటర్ విజయవాడ వారు నిర్వహించిన ఈ నాటికలోని సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కమర్తపు. మురళీ, బత్తినేని చారిటబుల్‌ట్రస్ట్ సభ్యులు హాజరై మాట్లాడారు. కార్యక్రమ నిర్వాహకులు సుబ్రమణ్యకుమార్, జగన్మోహన్‌రావు, దేవుందర్, నాగబత్తిని. రవి, విజేత సదానందం పాల్గొన్నారు.

రచ్చబండను సద్వినియోగం చేసుకోవాలి

» టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గోవిందరావు



మంగాపురంతండాలో రచ్చబండను ప్రారంభిస్తున్న గోవిందరావు

నేలకొండపల్లి, జూన్15(ఆంధ్రజ్యోతి): మంగాపురంతండా వాసులు రచ్చబండను సద్వినియోగం చేసుకోవాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు తేజావత్ గోవిందరావు పిలుపునిచ్చారు. తండాలో శిథిలావస్థకు చేరిన రచ్చబండను తండాలోని ఉద్యోగస్తులు, గ్రామస్తుల సహకారంతో పునఃనిర్మించిన రచ్చబండను ఆదివారం గోవిందరావు ప్రారంభించారు. తండాలోని ఉద్యోగులు తండా అభివృద్ధికి సైతం కృషి చేస్తున్నారన్నారు. తనతో పాటుగా నాగరాజు,పీఈటీ రచ్చబండ మరమ్మతు పనులను పర్యవేక్షించగా తండాకు చేందిన అడిషనల్ డీసీపీ రామదాసు తేజ, వివిధ హోదాల్లో పని చేస్తున్న రామమూర్తి, సక్రియానాయక్, గాంధీరమణ, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ భూక్యా సుధాకర్, మాజీ ఎంపీటీసీ అరుణకోటేశ్వరరావు తదితరులు సహకరించారు. రచ్చబండ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు గోవిందరావు చెప్పారు.

'నగ్నదేశం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్15 (ఆంధ్రజ్యోతి): కవి, అనువాదకుడు, చిత్రకారుడు సవ్యసాచి రచించిన నగ్నదేశం పుస్తకావిష్కరణ ఆదివారంరాత్రి నగరంలోని టెండర్ రూట్స్ పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాషువాసాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా. శ్రీనివాసరావు, కవి, విద్యావేత్త రవిమారుత్, కవి రచయిత సాగర్, దేవేందర్, కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిలింగ్ సభ్యుడు ప్రసేన్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మణిపూర్‌లో స్త్రీని నగ్నంగా నడిబజారులో ఊరేగించిన సంఘటన అందరినీ కలచివేచిందని, దానిని దృష్టిలో పెట్టుకొని నగ్నదేశం అనే కవితను సవ్యసాచి రాసి ఆ కవిత శీర్షికనే ఈ పుస్తకానికి పేరుగా పెట్టుకున్నారని అన్నారు. పాత, కొత్త తరం కవుల తెలుగు కవుల సిగ్నేచర్‌పోయేమ్స్‌ను ఆంగ్ల భాషలోకి అనువాదం చేయటానికి ముందుకొచ్చారని ఇది కొత్త ప్రయోగమనీ అన్నారు. అనంతరం మహాకవి శ్రీశ్రీవర్ధంతి సందర్భంగా మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జీవన్, రమేష్, ఇబ్రహీం, సునంద, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం తలుపు తట్టని విద్యార్థులు

» ఈనెల 12న ప్రారంభమైన బడులు
» హాస్టల్స్‌లో విద్యార్థుల చేరికలపై పడనున్న తీవ్రప్రభావం



విద్యార్థులు లేని మూడు వసతిగృహాల సముదాయం

ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్15(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవ్‌లు అనంతరం విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పూర్వ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అనేక చర్యలను తీసుకున్నారు. మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను అందంగా నిర్మాణాలు చేయించి ఉపాధ్యాయుల్ని కేటాయించి తిరిగి పూర్వ వైభవం కోసం కృషి చేశారు. మరో వైపు సంక్షేమ వసతిగృహాల తీరు ఇందుకు భిన్నంగా ఉంది. సాక్షత్తు జిల్లా కేంద్రంలోని సంక్షేమ వసతిగృహాల్లో పొయ్యిలు ఆది వారం వరకు వెలగలేదు. ఈనెల 12న బడిగంట మోగినా ఒక్కో వసతిగృహానికి ఒక విద్యార్థి కూడా రాలేదు. జిల్లా కేంద్రంలో ఒక్కో సంక్షేమ వసతిగృహంలో 100నుంచి120 మంది విద్యార్థుల వరకు చేరుతుంటారు. ఖమ్మంలోని మూడు ఎస్సీ సంక్షేమ వసతి గృహాలతో కలిపి కాంప్లేక్స్ ఉంది. ఇక్కడ 250నుంచి 270 మంది విద్యార్థులు ఉంటారు. కానీ ఒక్కరూ కూడా వసతిగృహం తలుపుతట్ట లేదు. ఇటువంటి పరిస్తితి మరో వారం కాన సాగితే హాస్టల్స్ చేరికలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ విషయంపై సాంఘీక సంక్షేమాధికారి కస్తాల సత్యనారాయణ వివరణ కోసం ప్రయత్నించగా వరుస సెలవులు కారణంగా విద్యార్థులు చేరలేదన్నారు. సోమవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తామన్నారు.

విద్యాభివృద్ధికి కారుణ్య సొసైటీల కృషి

తల్లాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేద పిల్లల్లో విద్యాభివృద్ధికి చేయూతనిస్తున్న కారుణ్య సోషల్‌సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో కారుణ్య సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు పెన్నులు, డిక్షనరీలను తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ ఛైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలరెడ్డి, ఝాన్సీ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, పట్టణ కమిటీ అధ్యక్షుడు జీవీఆర్, తాళ్లపల్లి కృష్ణ, లూర్దుమాత విచారణసిస్టర్ ప్రసన్న, సొసైటీ సభ్యులు దారా సంతోష్, జోజి, అంకమరాజు, దంతాల నరసింహారావు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే వేసవి శిక్షణ శిబిరం

వైరా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైరాలోని బాలికోన్నత పాఠశాలలో గడచిన 48రోజుల నుంచి నిర్వహిస్తున్న కరాటే వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాలకు చేరుకోవచ్చు

ఏదూలపురం మున్సిపల్ కమిషనర్

బోనకల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవరుచుకుని చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని ఏదూలపురం మున్సిపాలిటీ కమీషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో ఆదివారం వాసిరెడ్డి పిచ్చయ్య 9వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మోహన్ రావు విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలను కమిషనర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. తాను ముష్టికుంట్ల పాఠశాలలో పూర్వ విద్యార్థినేనని పేర్కొన్నారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు గ్రామ కాంగ్రెస్ నాయకుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు 3వేలు, 2వేలు, ఒక వేయ్యి రూపాయల చొప్పున అందజేస్తానని ప్రకటించారు. అనంతరం కమీషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాగ్యలక్ష్మీ, మాజీ సొసైటీ ఛైర్మన్ కొంగర వెంకట నారాయణ, బంధం నాగేశ్వరరావు, బోయినపల్లి వెంకటేశ్వర్లు, బంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE

వైరా-మధిర సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

సోమవారం 16 జూన్ 2025

రైతుభరోసా కోసం దరఖాస్తుల ఆహ్వానం



ఏవో వాణి

కూసుమంచి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొత్తగా పాస్‌బుక్ పొందిన రైతులు రైతు భరోసాకోసం దరఖాస్తు చేసుకోవాలని కూసుమంచి మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి కోరారు. వానాకాలం 2025-26 సంవత్సరానికి సంబంధించి ఈఏడాది జూన్ 5తేదీనాటికి భూభారతిలో పాస్‌బుక్ పొందిన లేదా డిజిటల్ సైన్ అయిన రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి భూమి పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జీరాక్స్ కాపీలు అందించాలని కోరారు.

ముగిసిన కరాటే వేసవి శిక్షణ శిబిరం



బ్లాక్ బెల్టు అందజేస్తున్న నేతలు

వైరా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైరాలోని బాలికోన్నత పాఠశాలలో గడచిన 48రోజుల నుంచి నిర్వహిస్తున్న కరాటే వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, వైరా ఎస్‌ఐ పి.రామారావు పాల్గొన్నారు. కరాటే మాస్టర్ రఘును వారు అభినందించారు. గడచిన 14సంవత్సరాలుగా ఈ ప్రాంతంలోని చిన్నారులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నందున మాస్టర్ రఘును అభినందించారు.

పదేళ్లుగా బోడేపూడి వైద్య శిబిరం సేవలు



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైరా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైరాలో పది సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ప్రతినెలా మూడో ఆదివారం ఈ ప్రాంతంలోని రోగులకు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ ఆదివారం కూడా బోడేపూడి వెంకటేశ్వర్‌భవన్‌లో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ చీకటి భారవి, డాక్టర్లు జట్ల రంగారావు, పిల్లలమర్రి సుబ్బారావు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఆ సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ బొంతు సమత, నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మత్తు పదార్థాలు సేవిస్తే కేసులే: ఎస్‌ఐ



యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామారావు

వైరా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్‌ను సేవించే యువకులపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వైరా ఎస్‌ఐ పి.రామారావు హెచ్చరించారు. వైరా ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న అనుమానిత యువకులకు ఆదివారం వైరా పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదువుతున్న యువకులు నిషేధిత మత్తుపదార్థాలైన గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలను సేవిస్తూ చెడు వ్యసనాలకు లోనై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యువకులు ఈ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. లేనట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వర్షాలు కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకాలు



బొడ్రాయి (నాభిశిల)కు జలాభిషేకం చేస్తున్న మహిళలు

కారేపల్లి, జూన్ (ఆంధ్రజ్యోతి): సమృద్ధిగా వర్షాలు పడి పంటలు బాగా పండాలని కోరుకుంటూ మండల పరిధిలోని రొట్టమాకురేవు గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఆదివారం గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ముందుగా బిందెలతో ఊరేగింపుగా తరలివచ్చి బొడ్రాయికి పసుపు,కుంకమలు చల్లి పూజలు చేశారు. అనంతరం జలాభిషేకం చేశారు. తదుపరి శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చిన మహిళలు స్వామి వారికి కూడా ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఇండ్ల వద్ద నుంచి తీసుకవచ్చిననైవేధ్యాలను దేవతలకు సమర్పించారు. కార్యక్రమంలో చుంచులక్ష్మీ, చీమలకౌసల్య, చింత వెంకటమ్మ, ఇరుప గురవమ్మ, కుంజరాధమ్మ, ఉడుగు కళావతి, పొదెం చంద్రిక, చింత రాధ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన విద్యార్థి



చరణ్‌జీత్

మధిరరూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీసెట్)లో మధిరకు చెందిన చరణ్‌జీత్ 334వర్యాంకుతో కరీంనగర్‌లోని సైనిక్‌స్కూల్‌లో సీటు సాధించాడు. రాష్ట్ర వ్యాప్తంగా టీసెట్‌లో 35వేల మంది విద్యార్థులు పరీక్ష రాయగా 800మంది విద్యార్థులు మెడికల్, ఫిజికల్ టెస్టులకు అర్హత సాధించారు. సైనిక్ స్కూల్‌లోని 80సీట్లకు 1:10 నిష్పత్తిలో నిర్వహించిన మెడికల్ ఫిజికల్ టెస్టులలో ప్రతిభను చాటి మధిరకు చెందిన గద్దల చరణ్‌జీత్ ఎంపికయ్యాడు. సైనిక్‌స్కూల్‌కు ఎంపికైన విద్యార్థి 1నుంచి 3వ తరగతి వరకు మధిరలోని శ్రీచైతన్య పాఠశాలలో 4,5 తరగతులు మధిరలోని ప్రభుత్వ ఎంపీపీఎస్ పాఠశాలలోచదివాడు. టీసెట్ ఎంట్రన్స్ టెస్టుకు మధిరలోని శ్రీకృష్ణ నవోదయ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నాడు. సైనిక్‌స్కూల్‌లో సీటు సాధించిన చరణ్‌జీత్ 6నుంచి ఇంటర్ వరకు ఉచితంగా చదవనున్నారు. జిల్లా నుంచి సీటు సాధించిన చరణజీత్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

ప్రారంభానికి సిద్ధంగా రైతునేస్తం కేంద్రాలు

- నేటి మధ్యాహ్నం 3గంటలకు రైతులతో సీఎం ముఖాముఖి
- పండగలా వేడుక జరపాలి:కలెక్టర్



కల్లూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతు నేస్తం కేంద్రం

కల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సోమవారం కల్లూరు డివిజన్ పరిధిలో గల ఐదు మండలాల్లో వ్యవసాయ శాఖ తరుపున రెండవదశగా పది రైతునేస్తం కేంద్రాలను ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ దూరిశెట్టి అనుదీప్ శనివారం జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కల్లూరు డివిజన్ పరిధిలో గల ఐదు మండలాల్లో కొత్తగా పది రైతునేస్తం కేంద్రాలు (ధ్రుశ్యశ్రవణ) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి డివిజన్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్రీనివాసరెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సత్తుపల్లి మండలంలో ఎస్ఎస్‌పాలెం, కాకర్లపల్లి, వేంసూరు మండలంలో వివిపాలెం, శంభునిగూడెం, పెనుబల్లి మండలంలో అడవిమల్లేల, కుప్పెనకుంట్ల, కల్లూరు మండలంలో కల్లూరు, ముచ్చవరం, తల్లాడ మండలంలో కుర్నవల్లి, మల్లారం గ్రామాల్లో గల రైతు వేదికల్లో రైతునేస్తం కేంద్రాలు లాంఛనంగా ప్రారంభం కానున్నాయని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏకకాలంలో ఈ కేంద్రాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. ఓ పండుగ వాతవరణంలో రైతునేస్తం కేంద్రాల ప్రారంభ వేడుకలా జరపాలని నిర్ణంచినట్లు ఏడిఏ వివరించారు. ఈ వేడకలకు ప్రజా పతినిధులను. రైతులును ఆహ్వానించడం జరిగిందన్నారు. ముందుగా వ్యవసాయ శాస్త్రవేతలు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని, ఆ తరువాత సీఎం రేవంత్‌రెడ్డి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్శిటీ నుంచి రైతునేస్తంలో పాల్గొని రైతులతో ముఖాముఖి ప్రత్యక్షప్రసారం కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి ప్రాంతం నుంచి కనీసం 250 మంది రైతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని తిలకించి విజయవంతం అయ్యేలా జిల్లాలోని వ్యవసాయ అధికారులకు కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండలాల పరిధిలో గల తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఏఈఓలను కూడ పాల్గొని విజయవంతం చేసేలా భాగస్వాములను చేశారు.

నేడు రైతు నేస్తం కార్యక్రమం

ఎర్రుపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం, మీనవోలు రైతువేదికల్లో సోమవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈకార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా రైతులతో ముఖముఖీలో పాల్గొననున్నట్టు తహసీల్దార్ మన్నె ఉషశారద, ఏవో సాయిశివ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3గంటల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 1031 కేంద్రాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం జరగనుంది. ప్రతి గ్రామం నుంచి రైతులనుసమీకరించి అత్యధికంగా రైతులు పాల్గొనేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ముందుగా ప్రకటించినట్టుగానే రైతులుక సీఎం రైతుబరోసా ప్రకటిస్తారని సూత్రప్రాయంగా తెలుస్తోంది.



పత్తి మొక్కలకు బ్యాటరీ పంపు ద్వారా నీరు అందిస్తున్న రైతు

భానుడి భగభగ.. వడలిపోతున్న పత్తి మొక్కలు

చింతకాని, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రోహిణిలో రైతులను మురిపించిన వరుణుడు ఇప్పుడు మొఖం చాటేశాడు. గడచిన కొన్ని రోజులుగా కారు మబ్బులు పడుతున్న వర్షం పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ మొదటి వారంలో పత్తి విత్తిన రైతులు చినుకు జాడ లేక పంటలు ఎండిపోతుండడంతో నానా తంటాలు పడుతున్నారు. మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు వల్లంకొండ కోటి మూడు ఎకరాల పత్తి సాగు చేశాడు. నీరు లేక పంట ఎండిపోతుండటంతో బ్యాటరీ పంపులతో రైతులు మొక్కలకు నీరు అందిస్తున్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాలకు చేరుకోవచ్చు

- ఏదూలాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఆళ్ల శ్రీనివాసరెడ్డి, దాతలు

బోనకల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవరుచుకుని చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని ఏదూలపురం మున్సిపాలిటీ కమీషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో ఆదివారం వాసిరెడ్డి పిచ్చయ్య 9వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మోహన్‌రావు విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలను కమిషనర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. తాను ముష్టికుంట్ల పాఠశాలలో పూర్వ విద్యార్థినేనని పేర్కొన్నారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు గ్రామ కాంగ్రెస్ నాయకుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు 3వేలు, 2వేలు, ఒక వెయ్యి రూపాయల చొప్పున అందజేస్తానని ప్రకటించారు. అనంతరం కమీషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాగ్యలక్ష్మీ, మాజీ సొసైటీ చైర్మన్ కొంగర వెంకట నారాయణ, బంధం నాగేశ్వరరావు, బోయినపల్లి వెంకటేశ్వర్లు, బంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజులపాలెం రోడ్డుకు మోక్షం ఎప్పుడు?



అధ్వాన స్థితిలో నాచారం దేవాలయం రహదారి

ఏన్కూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పూర్తి గిరిజన గ్రామం అయిన రాజులపాలెనికి రహదారి సౌకర్యం లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామం నుంచి నాచారం వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే 1.5 కి.మీ. రోడ్డు అధ్వాన్నస్థితిలో ఉంది. ప్రస్తుతం రహదారి సౌకర్యం లేక మండల కేంద్రం ఏన్కూరు, నాచారం దేవాలయానికి చుట్టూ 10కి.మీ. తిరిగి ఇబ్బంది పడుతూ వెళుతున్నారు. ఈ రహదారి నిర్మిస్తే ఏన్కూరుతోపాటు నాచారం దేవాలయానికి వెళ్లడానికి దగ్గరవుతుంది. దూరాభారం తోపాటు పొలాలకు వెళ్లడానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఈ విషయమై ఎంపీ, ఎమ్మెల్యేలకు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేదు. విసిగి వేసారిన గ్రామస్థులు గత శాసనసభ ఎన్నికలను బహిష్కరించగా, రహదారి నిర్మాణం చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. ఏడాదిన్నర కావస్తున్నా హామీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కలిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గీత కార్మికుల ఆరాధ్య దైవానికి పూజలు



బోనకల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఆదివారం గీత కార్మికుల ఆరాధ్య దైవం కాటమయ్యకు గౌడ కులస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గీత కార్మికులు బోనాలను సమర్పించి, గీత వృత్తి పనిముట్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ పాపారావు, మరీదు వీరబాబు, కందుల సత్యం, వేణు, ఉపేందర్, రామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వైరా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైరాలోని శ్రీనికేతన్ విద్యాలయంలో 2004-2005 పదోతరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం వైరాలో జరిగింది. ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రావు, ఉపాధ్యాయులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు నాటి అనుభవాలను నెమరవేసుకొని ఆటపాటలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు.

ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు



హైదరాబాద్‌లో భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సత్యనారాయణ



బోనకల్‌లో రక్తదానం చేస్తున్న నాయకులు

వైరా/బోనకల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఆదివారం వైరా మండల కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. భట్టి విక్రమార్క జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తన స్వగ్రామంలోని ఎదురుగడ్డలో భట్టి విక్రమార్క జన్మదిన వేడుకల కేక్ కట్ చేశారు. వైరాలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, పణితి సైదులు పాల్గొన్నారు. హైదరాబాద్ ప్రగతి భవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, నాయకులు పణితి శ్రీనివాసరావు, పల్లపు కొండలు, నిప్పు తదితరులు భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆయన ఫొటోను బహూకరించారు.

బోనకల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బోనకల్, రావినూతల, ఆళ్లపాడు తదితర గ్రామాల్లో ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆశ్రయ సేవా సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కొరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా నాయకులు రక్తదానం చేశారు. ఆశ్రమాల్లో పండ్లు పంపిణీ చేశారు.కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, రామకోటేశ్వరరావు, గాలి దుర్గారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, చేబ్రోలు రమ, నల్లమోతు సత్యనారాయణ, పాసంగులపాటి కోటేశ్వరరావు, బీపీ నాయక్, నాగేశ్వరరావు, కందుల పాపారావు, గూడ నర్సయ్యశాస్త్రీ పాల్గొన్నారు.

21న టీయూసీఐ రాష్ట్ర మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు

సత్తుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21,22వ తేదిల్లో నిజామాబాద్‌లో జరప తలపెట్టినట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని సింగరేణి బెల్ట్ క్లీనింగ్ సమంత క్యాంప్ వద్ద మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. కనీస వేతనా చట్టం ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాల్సి ఉందన్నారు. కానీ గత ప్రభుత్వాలు 12ఏళ్లుగా జీఓలను విడుదల చేయకపోవడం అత్యంత దారుణమన్నారు. చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్న శ్రామికవర్గాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే ఇలా తాత్సారం చేస్తుంటే ఎవరికి చెప్పుకోవాలని వాపోయారు. గత శతాబ్ద కాల ఉద్యమాన్ని సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు ఈ మహాసభలను నిర్వహిస్తుండగా కార్మికులంతా వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కట్ల ప్రసాదు, శ్రీనివాస్, సురేష్, రమేష్, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కారుణ్య సొసైటీల కృషి



నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ

తల్లాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పేద పిల్లల్లో విద్యాభివృద్ధికి చేయూతనిస్తున్న కారుణ్య సోషల్‌సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో కారుణ్య సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు పెన్నులు, డిక్షనరీలను తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. 2005 నుంచి 20 ఏళ్లుగా కారుణ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు గొడుగునూరు బాలరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో ఎంతో కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా బాలరెడ్డి, ఝాన్సీ దంపతులను ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ మండల కార్యదర్శి వెంకట్‌లాల్, పట్టణ కమిటీ అధ్యక్షుడు జీవీఆర్, కృష్ణ, లూర్దుమాత విచారణసిస్టర్ ప్రసన్న, దారా సంతోష్, జోజి, అంకమరాజు, నరసింహారావు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీ భవన నిర్మాణం లేనట్లేనా



శిలాఫలకం

చింతకాని, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 500 జనాభా దాటిన శివారు గ్రామాలను గత ప్రభుత్వం 2018లో పంచాయతీలుగా మార్చింది. అనంతరం పంచాయతీ కార్యకలాపాల నిర్వహణకు కొత్త భవనాల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షలు మంజూరి చేశారు. అందులో భాగంగా చింతకాని శివారు గ్రామంగా ఉన్న నరసింహపురం 2018లో నూతన గ్రామంగా ఏర్పడిన తరువాత 2023వ సంవత్సరంలో నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరవడంతో అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ శిలాఫలకం ప్రారంభించి నేటికి రెండేళ్లు పూర్తైంది. భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం లేకపోవడంతో మాజీ సర్పంచ్ దొడ్డ ప్రవీణ చొరవతో గ్రామానికి చెందిన ఓ దాత స్థలం ఇచ్చేందుకు ముందకు రావడంతో భవన నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎన్నికల రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో పంచాయతీ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రెండేళ్లు గడచిన పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో పంచాయతీ పాలన ఇంకా అద్దే భవనాల్లో కొనసాగుతుంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవ చూపి నూతన పంచాయతీ భవన నిర్మాణం పనులు ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కరెంట్ స్తంభాల మధ్యే రోడ్డు నిర్మాణం



రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభం

వైరా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైరాలో అత్యంత కీలకమైన రిజర్వాయర్ రోడ్డు నిర్మాణ పనులపై స్థానికులు పెదవిరుస్తున్నారు. అసలే ఇరుకుగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు మధ్యలో ఉన్న కరెంట్ స్తంభాలను తొలగించకుండా చేస్తున్న నిర్మాణంపై స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. వైరా రిజర్వాయర్‌కు అలాగే పర్యాటక కేంద్రానికి ఎంతో కీలకమైన ఈ రోడ్డు నిర్మాణంపై మొదటి నుంచి వివాదాలు రేగుతున్నాయి. 80నుంచి 100అడుగుల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డు ఆక్రమణలతో కుచించుకుపోయింది. ఈ కుచించుకుపోయిన రోడ్డుపైనే రూ.80లక్షల సుడా నిధులతో పనులు చేపట్టారు. 52నుంచి 57అడుగుల వెడల్పుగా అధికారులు నిర్ధారించి హడావిడిగా పనులు చేసి చేతులు దులుపుకునేందుకు తీవ్ర ప్రయాసపడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నాటి నుంచి కూడా ఈ రోడ్డు వెడల్పు నిర్ధారణపై అఖిలపక్ష రాజకీయ నాయకులు అడుగడుగునా ప్రశ్నిస్తున్నారు. గతంలో 57నుంచి 60అడుగుల వెడల్పుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్ధారించారు. ఇప్పుడు అది కాస్తా 52నుంచి 57అడుగుల వెడల్పుకు తగ్గిపోయింది. ఈ రోడ్డుపైన కొద్దిరోజుల కిందటి వరకు 26అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. రోడ్డు మధ్యలో రెండు అడుగులతో డివైడర్‌కు రెండువైపులా 12అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. అయితే ఈ రోడ్డు నిర్మాణం అత్యంత ఇరుకుగా ఉందని తమ దృష్టికి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మునిసిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. డివైడర్‌కు ఇరువైపులా కనీసం 15అడుగుల చొప్పున వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ఆదేశించారు. ఇప్పుడు ఇరువైపులా ఐదు నుంచి ఆరు అడుగుల వెడల్పు పెంచి రోడ్డు నిర్మిస్తున్నారు. ఓవైపు రోడ్డుపైనే కరెంట్ స్తంభాలున్నాయి. ఆ స్తంభాలను తొలగించకుండా వాటి మధ్యలోనే రోడ్డు నిర్మిస్తున్నారు. వెడల్పు పెంచిన రోడ్డు మొత్తం కరెంట్ స్తంభాల మధ్యలోనే ఉంది. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి కరెంట్ స్తంభాలను తొలగించకుండానే వాటి మధ్యలోనే ఈ రోడ్డు నిర్మిస్తుండడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కరెంట్ స్తంభాలు తొలగించకుండా రోడ్డు వెడల్పు పెంచినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం రోడ్డు వెడల్పు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించగా ఆయనను సంతృప్తి పర్చేందుకు వెడల్పు పెంచిన అధికారులు కరెంట్ స్తంభాలు తొలగించే విషయంలో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కరెంట్ స్తంభాలు తొలగించి ఆ తర్వాతే రోడ్డు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.